మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 55 వెల - రూ 5 : 00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnaga Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yada



## తెలంగాణలో పోలింగ్ 65.67శాతం

- అత్యధికంగా భువనగిరిలో 76.78.. హైదరాబాద్‌లో 48.48శాతం నమోదు
- 2019 లోక్‌సభ కంటే 3 శాతం పెరిగిన ఓటింగ్
- అసెంబ్లీ సెగ్మెంట్‌లో నర్సాపూర్ అత్యధికంగా 84.25.. మలక్‌పేట అత్యల్పంగా 42.76శాతం
- వివరాలు వెల్లడించిన సీఈవో వికాస్‌రాజ్
- స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఈవీఎంలు
- మూడంచెల భద్రత ఏర్పాటు చేసిన అధికారులు

2లో..





## అధిక స్థానాలు మేమే గెలుస్తాం

- కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం ఖాయం
- కారు గ్యారేజీకే పరిమితం
- ఎన్‌డీఏకు 400 సీట్లు పక్కా: లక్ష్మణ్
- తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం: ఈటల రాజేందర్

హైదరాబాద్ (ప్రజా మంటలు): త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని రాజ్యసభ సభ్యులు కే. లక్ష్మణ్ అన్నారు. కారు పని అయిపోయిందని విమర్శించారు. జాకీ పెట్టిన లేపినా కారు లేచే ప్రసక్తే లేదని చెప్పారు. భవిష్యత్ అంత బీజేపీ దేనని ప్రజలంతా బీజేపీవైపే చూస్తున్నారని తెలిపారు. హైదరాబాద్ లో లక్ష్మణ్ మీడియా సమావేశం నిర్వహించారు.

మిగతా2లో..

## కాంగ్రెస్ పార్టీకి 13 ఎంపీ సీట్లు

**-ఎన్నికలు ముగిశాయి ఇక తన దృష్టి అంతా పరిపాలన పైనే**

- రుణమాఫీకి సిద్ధంగా ఉన్నాం
- భారాస, భాజపా కుమ్మక్కు రాజకీయాలు
- బీజేపీకి 210 సీట్లు కూడా దాటబోవు
- కంటోన్మెంట్‌లో 20 వేల మెజార్టీ సాధిస్తున్నాం
- రేషన్ షాపులను పటిష్టపరుస్తాం
- సన్నబియ్యంతో పాటు మరిన్ని సరుకుల అమ్మకం
- రైతు రుణమాఫీపై బ్యాంకర్లతో చర్చిస్తాం
- మీడియాతో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, (ప్రజా మంటలు): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 13 ఎంపీ సీట్లు వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు ముగిశాయని... ఇక తన దృష్టి అంతా పరిపాలన పైనే అని తెలిపారు. బీఆర్ఎస్ ఎలక్షన్ ఎలా చేసిందనే దానిని బట్టి రిజల్ట్ ఉంటుందని చెప్పుకొచ్చారు. మంగళవారం మీడియాతో చిట్‌చాట్ చేశారు.ఎవరి ఓట్లు నేతలు తీసుకుంటే ఎలక్షన్ అంచనా వేయొచ్చని అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ 20 వేల మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో దేశం మొత్తం మీద 210 ఎంపీ సీట్లు కూడా దాటేలా లేదన్నారు. తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 9 నుంచి 13 ఎంపీ స్థానాలు గెలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ సరళిపై మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సికింద్రాబాద్‌లో గతం కంటే పోలింగ్ మెరుగైందని, కాంగ్రెస్ అభ్యర్థికి కనీసం 20వేల మెజార్టీ వస్తుందన్నారు. ఆరేడు స్థానాల్లో భారాసకు డిపాజిట్లు కూడా రావు. మెదక్‌లో భాజపా మూడో స్థానంలోకి వెళ్లింది. ఏ పార్టీకి ఆ పార్టీ పనిచేసి ఉంటే అంచనా వేయడం సులువు. భారాస శ్రేణులు పూర్తి స్థాయిలో భాజపాకు పనిచేశాయి. భాజపాకు ఇవాళ ఫీడ్ బ్యాక్ తెప్పించుకుంటే 13 స్థానాలు వస్తాయని సమాచారం ఉంది. ఇంతటితో రాజకీయ కార్యకలాపాలు ముగిశాయి. ఇప్పటినుంచి పరిపాలనపై దృష్టి ఉంటుందన్నారు. రేపటి నుంచి పరిపాలనపై పూర్తిగా దృష్టి పెడుతామన్నారు. ధాన్యం కొనుగోలు రుణమాఫీపై దృష్టి పెడతామని వివరించారు. స్కూళ్లు ఓపెన్ అవుతాయి కాబట్టి వాటిపై దృష్టి పెడుతామని అన్నారు. రుణమాఫీ కోసం ఎఫ్ఆర్బీఎం పరిధిలో లోన్ తీసుకుంటామని చెప్పారు. ఇక రాజకీయం ముగిసిందని.. రాష్ట్రంలో తన దృష్టి పూర్తిగా పరిపాలనపైనే పెడుతానని తెలిపారు. ప్రతిపక్షాలు విమర్శలు ఏం అనుకున్న తాను పట్టించుకొనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు కూడా పూర్తిగా ఇవ్వలేదని ప్రతిపక్షాలు అన్నాయని.. ఇప్పుడు రైతు బంధు నిధులు వేశాక మా క్రెడిట్ అని చెబుతున్నారని అన్నారు. అసెంబ్లీలో చర్చ చేసి ఏదైనా నిర్ణయం తీసుకుంటామని... లేదంటే అఖిలపక్షం పెడుతామని చెప్పారు. రేషన్ షాపుల్లో నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసి పంచుతామని స్పష్టం చేశారు. సామాన్యులు కొనుగోలు చేసే 9 వస్తువులు రైతుల నుంచి కొనుగోలు చేసి ఇస్తామన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం ఇస్తామని హామీ ఇచ్చారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రజలకు ఇస్తామని మాటిచ్చారు. స్టేట్‌కు ఏం కావాలో వాటిని అమలు చేసేలా చూస్తామని అన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటా మని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, సమస్యలు, విద్యా సంవత్సరం మొదలుకానుంది, సన్నబియ్యం సరఫరా, పుస్తకాలు, యూనిఫామ్ తదితర అంశాలపై సమీక్ష చేస్తా. ఫార్మర్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి దానికి ఆదాయం సమకూర్చుతాం. దాని ద్వారా రుణం తీసుకుని రైతు రుణమాఫీ చేస్తాం. రైతుకు పెట్టుబడి, గిట్టుబాటు ధరలపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. రేషన్ దుకాణాల ద్వారా గతంలో

మిగతా2లో..



## 12 నుంచి 14 ఎంపీ సీట్లు మావే..

**- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధీమా**

జయశంకర్ భూపాలపల్లి(జనంసాక్షి): జిల్లాలోని కాటారం మండలం దన్వాడలో శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాన్ని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,మంత్రి శ్రీధర్ బాబు దర్శించుకున్నారు. శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయ 3వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దత్తాత్రేయ స్వామి దర్శనం చేసుకోవడంతో తన జన్మధన్యమైం దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని అర్థమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో సుమారు12 నుంచి 14 సీట్లు కాంగ్రెస్ గెలుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీచేసిన బస్సుయాత్ర, పాదయాత్రతో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడబోతోందన్నారు. రాహుల్ పోరాటాల ఫలితాలు.. కాంగ్రెస్ నాయకత్వంలో ఇండియా కూటమి ప్రజలు ఓట్ల ద్వారా చూపిస్తున్నారని తెలిపారు. కొన్ని పార్టీలు అన్ని బావజాలలను పక్కనపెట్టి ప్రజల్లో సెంటిమెంట్‌ను రెచ్చగొట్టడానికి చూశాయని మండిపడ్డారు. ప్రజలు మాత్రం ఇండియా కూటమి వైపే మొగ్గు చూపారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## కవితకు మళ్లీ నిరాశే

**- 20వరకు వరకు కస్టడీ పొడిగింపు**

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బెయిల్ ఆశించిన బీఆర్ఎస్ కవితకు మరోసారి నిరాశే ఎదురైంది. ఆమె బియిల్ ఇవ్వని కోర్టు కస్టడీని మాత్రం పొడగించింది. మంగళవారం తో జుడీషియల్ కస్టడీ ముగిసినప్పటికీ మే 20 వ తేదీ వరకు పొడగిస్తూ ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక న్యాయ స్థానం రౌస్ అవెన్యూ కోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం కీలక విచారణ జరిగింది. కవితకు మరో 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీ పొడగించాలని కోర్టును ఈడీ కోరింది. 8 వేల పేజీలతో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేశామని ఈడీ తెలిపింది.

## విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే

- ప్రయత్నాల్లో ఉన్నాం
- రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి కోసం కేంద్రంతో చర్చిస్తున్నాం
- దేశంలో హైదరాబాద్‌ను రోల్ మోడల్ సిటీగా మార్చుతాం
- ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు చేయాల్సిఉంది
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



హైదరాబాద్ (ప్రజా మంటలు): రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి కోసం కేంద్రంతో చర్చిస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

మిగతా2లో..

## చల్లని కబురు- ముందుగానే 'నైరుతి'

**- ఈ సారీ ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశం - వాతావరణ శాఖ ప్రకటన - మూడు రోజులు మోస్తరు వర్షాలు**

హైదరాబాద్ (ప్రజా మంటలు): ఉక్కపోత, వడగాలులతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. ఈసారి కాస్త ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించనున్నాయని సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈనెల 19 కల్లా దక్షిణ అండమాన్ సముద్రం, దాన్ని ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతం, నికోబార్ దీవుల్లోకి ప్రవేశిస్తాయని తెలిపింది.ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు: దక్షిణ కర్ణాటక నుంచి వాయవ్య మధ్యప్రదేశ్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణశాఖ తెలిపింది. మంగళవారం వడగాలుల ప్రభావం ఉండదని, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు



వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షం పడొచ్చని అంచనా వేస్తోంది. ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీసత్యసాయి, బాపట్ల, అనకాపల్లి, విశాఖపట్నం, కాకినాడ, నంద్యాల, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో సోమవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా ప్రకాశం జిల్లా బల్లిపల్లిలో 79 మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షాల ప్రభావంతో ప్రజలకు వడగాలుల నుంచి ఉపశమనం లభించింది. సోమవారం ఏలూరు జిల్లా జీలుగుమిల్లిలో 41.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.తెలంగాణలో రాగల మూడు రోజులపాటు కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.మంగళవారం, బుధవారం కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. గురువారం ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పశ్చిమ విదర్భ దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ఆవర్తనం ఏర్పడిందని వాతావరణకేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.


## వరుసగా మూడోసారి వారణాసిలో మోడీ నామినేషన్

- హాజరైన కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా, సీఎం యోగి
- ఎన్డిఏ నుంచి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ హాజరు
- కాశీతో నా అనుబంధం ప్రత్యేకం: మోడీ



వారణాసి (ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల పోరులో భాగంగా ప్రధాని మోదీ మంగళవారం తన సిటింగ్ నియోజకవర్గం వారణాసి నుంచి నామినేషన్ వేశారు. కీలక ఎన్డీఏ నేతలు వెంటరాగా.. ఉదయం జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ స్థానం నుంచి ప్రధాని వరుసగా మూడోసారి పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. నామినేషన్ కార్యక్రమంలో పలువురు ఎన్డీఏ నేతలు పాల్గొన్నారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తదితరులు మోదీ వెంట రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వచ్చారు. దీనికి ముందు కాశీలోని దశాశ్వమేధ ఘాట్ వద్ద ప్రధాని పూజలు నిర్వహించారు. అక్కడే క్రూజ్ షిప్‌లో పర్యటించారు. కాలభైరవ ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం యోగితో కలిసి మోదీ.. ఆరు కిలోమీటర్ల మేర భారీ రోడ్‌షో నిర్వహించిన సంగతి తెలిసిందే. అనంతరం కాశీ విశ్వనాథుడి ఆలయంలో పూజలు చేశారు. రాత్రి ఇక్కడే బస చేశారు. నామినేషన్ నిమిత్తం మోదీ పర్యటన ఏర్పాట్లను హోంశాఖ మంత్రి అమిత్‌షా, సీఎం యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షించారు. ఆ పార్టీ సీనియర్ నేత సునీల్ బన్సల్ చాలా రోజుల నుంచి వారణాసిలో ఉండి పనులను చక్కబెట్టారు. ఇక, ఈ రోజు ఉదయం మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ఎమోషనల్ వీడియోను షేర్ చేశారు. కాశీతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఏడో విడతలో జూన్ ఒకటిన ఈ స్థానానికి పోలింగ్ జరగనుండగా.. నామినేషన్ దాఖలు చేయడానికి గడువు నేటితో ముగియనుంది. ఇక్కడ ప్రధానిపై కాంగ్రెస్ నుంచి యూపీ రాష్ట్ర పార్టీ శాఖ అధ్యక్షుడు అజయ్‌రాయ్ నిలబడిన సంగతి తెలిసిందే. మోదీపై ఈయన పోటీ చేయడం వరుసగా మూడోసారి కావడం గమనార్హం. 2014లో ప్రధాని తొలిసారి ఇక్కడ పోటీ చేయగా.. 56శాతం ఓట్లతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అజయ్ రాయ్‌కి కేవలం 75వేల ఓట్లు దక్కాయి. ఆమ్ ఆద్మీ తరపున అరవింద్ కేజ్రీవాల్ రెండో స్థానంలో నిలిచారు. ఇక, 2019 ఎన్నికల్లో ప్రధానికి 63 శాతం ఓట్లు రాగా.. అజయ్‌రాయ్‌కి

## ప్రజా నాడి




## మా ఖాతాలో 270 సీట్లు

- 400 సీట్లే లక్ష్యం
- ఆ దిశగా పోరాడుతున్నాం
- బెంగాల్ ప్రచారంలో అమిత్ షా



న్యూఢిల్లీ (ప్రజా మంటలు): లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ఇప్పటికే 270 సీట్లు గెలిచినట్టు తాను చెప్పగలనని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. నాలుగు దశల్లో అవసరమైన సీట్లు గెలిబోతున్నామని అన్నారు. 400కు పైగా సీట్లలో గెలుపు సాధించడమే లక్ష్యంగా ఈ ఎన్నికల్లో తాము పోరాడుతున్నామని పశ్చిమబెంగాల్లోని బాంగావ్‌లో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ చెప్పారు. ఇంతవరకూ నాలుగు విడతల పోలింగ్ పూర్తయింది. 380 సీట్లకు ఎన్నికలు జరిగాయి. బెంగాల్‌లో కూడా 18 సీట్లకు ఎన్నికలు పూర్తయ్యాయి. 380 సీట్లలో ప్రధాని మోదీ 270 సీట్లు గెలుచుకోవడం ద్వారా సంపూర్ణ మెజారిటీని సాధించారని నేను కచ్చితంగా చెప్పగలను. 400కు పైగా సీట్లు గెలుచుకోవడమే మా లక్ష్యం అని అమిత్‌షా అన్నారు. సీఏఏపై మమతా బెనర్జీ అపోహలు వ్యాప్తి చేస్తున్నారని, ఈ చట్టం కింద మతువా తెగల వారు పౌరసత్వం పొందుతారని ఆయన హామీ ఇచ్చారు. సీఏఏ కేంద్ర ప్రభుత్వ చట్టమైనందున దానిని అమలు కాకుండా మమతా బెనర్జీ ఎంతమాత్రం అడ్డుకోలేరని స్పష్టం చేశారు. శరణార్థులైన సోదరులకు దేశ పౌరసత్వం లభించకుండా ఈ ప్రపంచంలో ఏ శక్తీ ఆపలేదన్నారు. ఇది మోదీ ఇచ్చిన వాగ్దానమని గుర్తుచేశారు. పౌరసత్వం అనేది కేంద్ర ప్రభుత్వానికి ఉన్న విశిష్ఠ అధికారమే కానీ, రాష్ట్ర ప్రభుత్వాలది కాదనే విషయం మమతా బెనర్జీ గుర్తుంచుకోవాలన్నారు.

## నిందితుల జాబితాలో ఆప్‌ను చేరుస్తాం

**- ఢిల్లీ మద్యం కేసులో ఈడీ వెల్లడి**

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆమ్‌ఆద్మీపార్టీ పేరును నిందితుల జాబితాలో చేర్చనున్నట్లు ఢిల్లీ హైకోర్టుకు ఈడీ వెల్లడించింది.ఇదే జరిగితే.. ఈ దర్యాప్తు సంస్థ చరిత్రలో తొలిసారి ఓ జాతీయ పార్టీ పేరును నిందితులుగా ప్రస్తావించినట్లవుతుంది. ఆప్ నేత, ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా బెయిల్ పిటిషన్‌పై జరిగిన విచారణలో భాగంగా.. ఈ కేసులో అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేస్తామని, అందులో పార్టీ పేరు ఉంటుందని ఈడీ తెలిపింది.మద్యం కుంభకోణంలో ప్రధాన లబ్ధిదారు ఆమ్‌ఆద్మీ పార్టీ అయినప్పుడు.. ఆ పేరును నిందితుల జాబితాలో ఎందుకు చేర్చలేదని గతేడాది అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఆ నేపథ్యంలో ఈడీ దీనిపై కసరత్తు ప్రారంభించింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో వివిధ వ్యక్తుల నుంచి అందిన రూ.100 కోట్ల ముడుపులను ఆప్.. 2022 గోవా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వినియోగించిందని ఈడీ ఆరోపించింది. తాజాగా సిసోదియా బెయిల్‌ను వ్యతిరేకిస్తూ.. అనుబంధ ఛార్జిషీట్ గురించి ప్రస్తావించింది.సార్వత్రిక ఎన్నికలు పతాక స్థాయికి చేరిన వేళ ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఇటీవల సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించిన సంగతి తెలిసిందే.

## వికారాబాద్‌లో విషాదం

**- పెంపుడు కుక్క దాడిలో ఓ 5 నెలల పసికందు మృతి**

వికారాబాద్ (ప్రజా మంటలు): పెంపుడు కుక్క దాడిలో ఓ 5 నెలల పసికందు మృతి చెందిన ఘటన వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. అప్పటి వరకు కేరింతలు కొడుతూ ఆడుకున్న చిన్నారి, అంతలోనే విగతజీవిగా మారడంతో కన్నవారు కన్నీరుమున్నీరుగా విలపించారు. వికారాబాద్ జిల్లా తాండూరులో దారుణం జరిగింది. పెంపుడు శునకం దాడిలో ఓ శిశువు మృతి చెందింది. వివరాల్లోకి వెళితే, తాండూర్ మండలం గౌతపూర్ సమీపంలోని నాగభూషణం నాపరాతి పాలిష్? యూనిట్‌లో మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన దంపతులు దత్తు-లావణ్య కూలీలుగా పని చేస్తున్నారు. వీరికి 5 నెలల బాబు సాయినాథ్ ఉన్నాడు. భర్త యూనిట్‌లో పని చేస్తుండగా, భార్య యూనిట్ బయట వస్తువులు కొనటానికి వెళ్లింది. ఇంతలోనే అదే యూనిట్‌లో యజమాని పెంచుకున్న శునకం ఇంట్లోకి వెళ్లింది.ఇంట్లో ఆడుకుంటున్న పసికందుపై విచక్షణారహితంగా

మిగతా 2లో..

## కాంగ్రెస్ పార్టీకి 13 ఎంపీ సీట్లు

మాదిరి ఎక్కువ వస్తువులు తక్కువ ధరకు ఇస్తాం. ఏయే వస్తువులు ఇవ్వొచ్చో పరిశీలించి నిర్ణయిస్తాం. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని సీఎం స్పష్టం చేశారు. కాగా ఈ క్రమంలోనే రేపటి నుంచి పూర్తి స్థాయిలో పరిపాలనపై దృష్టి పెడతానని సీఎం పేర్కొన్నారు. రైతు రుణమాఫీ, ఇతర సమస్యలపై సమీక్షిస్తానని, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లు, సన్నబియ్యంపై అధికారులను ఆరా తీస్తానని వెల్లడించారు. ఫార్మర్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదాయం సమకూర్చుతామన్న సీఎం, కార్పొరేషన్ ద్వారా రుణం తీసుకుని రైతు రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 6 నాటికి రైతుబంధు పూర్తిగా ఇచ్చేశామన్న ఆయన, రేషన్ దుకాణాల ద్వారా ఎక్కువ వస్తువులను తక్కువ ధరకు ఇస్తామన్నారు.'మిల్లర్లు రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోలేం. అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేసి రైతుల సమస్యలపై చర్చిస్తాం. ప్రతి అంశం అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రేషన్‌కార్డులు ఇచ్చేందుకు పరిమితి లేదు, అది నిరంతర ప్రక్రియ. కార్పొరేట్ విద్య, వైద్యంపై పూర్తి స్థాయి అధ్యయనం చేయాల్సి ఉంది. విద్యుత్ కోతలు కొందరు కావాలనే చేస్తున్నట్లు ఉంది. రేపటి నుంచి సచివాలయానికి వెళ్తా. ఎన్నికల ముందు వెళ్తే విమర్శలు వస్తాయనే వెళ్లలేదు. అత్యవసర అంశాలపై నిర్ణయాలకు నియమావళి అడ్డురాదు. రీజనల్ రింగ్ రోడ్ రాష్ట్రానికి ప్రతిష్టాత్మకం కానుంది.' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.

## అధిక స్థానాలు మేమే గెలుస్తాం

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీల కంటే ఎక్కువ సీట్లు బీజేపీకే వస్తాయని తెలిపారు. నాలుగు విడతల్లోనే బీజేపీ మెజారిటీ సాధించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతి పక్ష హోదా కూడా దక్కుతుందో లేదో చూడాలని కే. లక్ష్మణ్ అన్నారు. రేవంత్ రెడ్డిని ప్రజలు నమ్మండం లేదని రాష్టాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నారని ఆరోపించారు. కేవలం ఓట్ల కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నారని లక్ష్మణ్ తెలిపారు. ఇకపోతే బీజేపీకి 370, ఎన్డీఏ కూటమికి 400 సీట్లు రాబోతున్నాయన్నార. కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హామీలను, దేవళ్లపై పెట్టిన ఒట్టును ప్రజలు నమ్మలేదన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉంటే, హామీలు ఎలా అమలుచేస్తారని విమర్శించారు. హామీల అమలుకు ప్రతి ఏటా రూ. 2 లక్షల కోట్లు కావాలని వివరించారు. సీఎం రేవంత్ సైతం కేసీఆర్ బాటలోనే నడుస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి తీసుకెళ్తోందని ఘాటుగా స్పందించారు. ధరణి సమస్యల పరిష్కారానికి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. గ్యారేజ్ నుంచి కారు బయటకు వచ్చే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్‌కు డిపాజిట్లు దక్కడమే గగనమని తెలిపారు. కాంగ్రెస్‌లో, బీఆర్ఎస్ విలీనం ఖాయమన్నారు. రెండు పార్టీలు బీజేపీ గెలుపును ఆపేందుకు యత్నించాయని ఆరోపించారు. కానీ తెలంగాణ ప్రజలు మోదీనామస్మరణ చేశారన్నారు. రైతు రుణమాఫీ చేయకపోతే సీఎం రేవంత్ సర్కారుకు ఆగస్ట్ సంక్షోభం తప్పదని హెచ్చరించారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చుతుందన్న సీఎం రేవంత్ మాటలను ప్రజలు నమ్మలేదని చెప్పారు. హామీలు అమలుచేయకపోతే ప్రజలు కాదు, కాంగ్రెస్ నేతలే తిరగబడుతారని తెలిపారు.

**తెలంగాణలో నిశ్శబ్ద విప్లవం**

లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగిసింది. జననాడి ఈవీఎంలలో నిక్షిప్తం చేసింది. వచ్చే నెల 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. అయితే ఈ లోపుగానే ఎవరి అంచనాల్లో వారు మునిగిపోయారు. ఈ నేపథ్యంలో మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి జూన్ 4న తెలియని నిశ్శబ్ద విప్లవం ఫలితం ఉంటుందని జోస్యం చెప్పారు. బీజేపీ ఊహించని రీతిలో సీట్లు సాధించనుందని ధీమా వ్యక్తం చేశారు. ఈవీఎంలలో ఓటరు తీర్పు నిక్షిప్తమైంది. జననాడిపై ఎవరి లెక్కల్లో వారు మునిగిపోయారు. ప్రజాతీర్పు తమవైపే ఉందంటూ మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 10 నుంచి 12 స్థానాలు గెలుస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెబితే బీఆర్ఎస్ అభ్యర్థులే ఎక్కువ స్థానాల్లో గెలుస్తారని కేటీఆర్ స్పష్టం చేశారు. డబుల్ డిజిట్‌ను దాటుతామని బీజేపీ పూర్తి విశ్వాసంతో ఉంది. జూన్ 4వ తేదీన తెలియని నిశ్శబ్ద విప్లవం ఉంటుందని మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. పోలింగ్ సరళి బీజేపీకి చాలా పాజిటివ్‌గా ఉందని పేర్కొన్నారు. అందరూ అనుకున్న దానికి భిన్నంగా పోలింగ్ జరిగిందని వివరించారు. ఊహించని రీతిలో ఫలితాలు సాధించబోతున్నామని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనలోనే దేశం ముందుకు పోతుందని, ఓటేసిన వారందరికి ధన్యవాదాలు తెలిపారు. తమ పార్టీ ఇచ్చిన హామీలు తప్పకుండా నెరవేర్చుతామని హామీ ఇచ్చారు.రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ప్రజల నుంచి సానుకూలంగా స్పందన వచ్చింది. కేంద్ర మంత్రి అమిత్ షా తెలంగాణలో పర్యటించినప్పుడు 12 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపారని అన్నారు. అవి కచ్చితంగా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్ బీజేపీనేనని ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తమ పాత్ర పోషిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో విలువలు లేని వ్యక్తి రేవంత్ రెడ్డి అని విమర్శించారు. వరంగల్‌లో మోదీ ప్రధాని కావాలన్న దేశ ప్రజల కాంక్ష ముందు కాంగ్రెస్ కుయుక్తులు పని చేయలేదని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. 2 నుంచి 3 లక్షల మెజార్టీతో గెలుస్తామని మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డి.కె.అరుణ ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలో పోలింగ్ 65.67శాతం

హైదరాబాద్, (ప్రజా మంటలు):

తెలంగాణలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ శాతం 65.67శాతానికి పెరిగింది. తుది పోలింగ్ వివరాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వెల్లడించారు. అత్యధికంగా భువనగిరిలో 76.78శాతం పోలింగ్ నమోదైందని.. అత్యల్పంగా హైదరాబాద్‌లో 48.48శాతం నమోదైనట్లు ప్రకటిం చారు. నర్సాపూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యధికంగా 84.25శాతం, మలక్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో అత్యల్పంగా 42.76శాతం నమోదైందని చెప్పారు. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 3శాతం పోలింగ్ పెరిగిందన్నారు.జూన్ 4న 34 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపును నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్‌లో 47.03శాతం, చేవెళ్లలో 56.40, కరీంనగర్‌లో 72.54, ఖమ్మంలో 76.09శాతం, మహబూబాబాద్‌లో 72.43శాతం, మల్కాజ్‌గిరిలో 50.78శాతం, మెదక్‌లో 75.09శాతం, నాగర్ కర్నూల్‌లో 69.46శాతం, నల్గొండలో 74.02శాతం, నిజామాబాద్‌లో 71.92శాతం, పెద్దపల్లిలో 67.87శాతం, సికింద్రాబాద్‌లో 49.04శాతం, వరంగల్‌లో 68.86శాతం, జహీరాబాద్‌లో 74.63శాతం పోలింగ్ నమోదైందని సీఈవో వికాస్ రాజ్ వివరించారు. ఇక కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో 51.61శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు.

**స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత**

తెలంగాణ వ్యాప్తంగా ఇవిఎలంను ఆయా కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూములకు చేర్చారు. భద్రతా బలగాల సమక్షంలో వీటిని ఆయా కేంద్రాలకు చేర్చారు. సిసి కెమరాలను ఇప్పటికే అమర్చారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈవీఎం, వీవీ ప్యాట్ల స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర బలగాలు మోహరించారు. ఆయా స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాలు, స్టాం÷-రగ్ రూమ్స్ వద్ద రౌండ్ ది క్లాక్ సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. అలాగే స్ట్రాంగ్ రూముల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర, రాష్ట్ర బలగాలతో భద్రత కట్టుదిట్టం చేశారు. అగ్నిమాపక సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు. కాగా.. రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సభ పోలింగ్ పక్రియ ముగిసింది. నిన్న ఉదయం 7 గంటల పోలింగ్ మొదలవగా సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. కొన్ని చోట్ల సరైన సమయానికే పోలింగ్ ముగియగా.. మరికొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద మాత్రం రాత్రి 11 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. 6 గంటల లోపు క్యూలో నిల్చున్న ఓటర్లకు నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా కూడా ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో పలు ప్రాంతాల్లో రాత్రి 11 గంటల వరకు పోలింగ్ పక్రియ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 64.74శాతం పోలింగ్ నమోదు అయ్యింది.

## వరుసగా మూడోసారి వారణాసిలో మోడీ నామినేషన్

14శాతం ఓట్లు దక్కాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి లోక్ సభ స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేశారు. వరసగా మూడోసారి ఇక్కడి నుంచి మోదీ బరిలోకి దిగారు. 2019, 2014లో కూడా వారణాసి నుంచి మోదీ పోటీ చేసి గెలుపొందిన సంగతి తెలిసిందే. నామినేషన్ వేసిన తర్వాత రుద్రాక్ష కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ కార్యకర్తలతో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. వారణాసిలో లోక్‌సభ అభ్యర్థిగా మరోసారి పోటీచేస్తున్న నరేంద్ర మోదీ సోమవారం ఆరు కిలోమీటర్ల మేర పట్టణంలో భారీ రోడ్‌షో నిర్వహించారు. విద్యా రంగ సంస్కర్త మదన్‌మోహన్ మాలవీయా విగ్రహానికి పూలమాల సమర్పించి యాత్రను ప్రారంభించారు. రోడ్‌షోలో ఆయన వెంట యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ ఉన్నారు. ప్రధానమంత్రికి ఆహ్వానం పలుకుతూ, కనీసం వంద చోట్ల స్వాగత తోరణాలు ఏర్పాటుచేశారు. కాషాయ దుస్తులు ధరించిన మహిళలు రోడ్డుకు అటు ఇటు పెద్దఎత్తున గుమిగూడి రోడ్‌షోకు స్వాగతం పలికారు. నరేంద్రమోదీపై పూలవర్షం కురిపించారు.

**కాశీతో నా అనుబంధం ప్రత్యేకం:మోడీ**

దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల వేడి కొనసాగుతున్న క్రమంలో సోమవారం 4వ దశ ఎన్నికలు ముగిసాయి. సార్వత్రిక ఎన్నికల్లో భాగం మరో కీలక ఘట్టానికి తెర లేచింది. మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ వారణాశిలో నామినేషన్ వేసారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ ఎన్డీఏ కూటమిలోని పార్టీల అధినేతలకు ఆహ్వానం అందించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కూడా ఈ కార్యక్రమాని హాజరయ్యారు. మరికొన్ని గంటల్లో నామినేషన్ దాఖలు చేయనున్న క్రమంలో ప్రధాని మోదీ ట్విట్టర్ వేదికగా ఓ ఆసక్తికర వీడియోను పోస్ట్ చేశారు. వారణాసితో తనకు ఉన్న అనుబంధం గురించి వివరిస్తూ వీడియోను దేశ ప్రజలతో పంచుకున్నారు. ఈ వీడియోలో మోదీ తొలిసారి వారణాసిని ఎప్పుడు సందర్శించారు. ఎన్నికల ప్రచారాన్ని ఎలా ప్రారంభించారు. లాంటి వివరాలను పేర్కొన్నారు. ఇక బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వారణాసి రూపురేఖలు ఎలా మారాయన్న విషయాన్ని ఇందులో సవివరంగా వివరించారు. ఇక వీడియోతో పాటు నరేంద్ర మోదీ.. 'కాశీతో నా అనుబంధం అద్భుతమైంది. సమగ్రమైంది, సాటిలేనిది. ఈ భావాన్ని మాటల్లో వ్యక్తీకరించలేను' అంటూ ఎమోషనల్ పోస్ట్ చేశారు.

## విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే

మీడియాతో తెలిపారు. హైదరాబాద్ లో సూపర్ గేమ్ ఛేంజర్ గా ఆర్‌ఆర్‌ఆర్ వచ్చిందన్నారు. దీంతో పాటు హైదరాబాద్ నుంచి విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే సాధన కోసం కూడా గతంలో తాను ఎంపీగా ఉన్నప్పుడు ప్రయత్నించానని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు . హైదరాబాద్ నుంచి విజయవాడ ఒక ఎక్స్ ప్రెస్ హైవే పెట్టాలని.. ఒక గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు చేసే ప్రయత్నంలో ఉన్నట్టు తెలిపారు. అది మంజూరు అయితే హైదరాబాద్ నుంచి విజయవాడ ఎవ్వరూ ఎక్కరని తెలిపారు. దేశంలో హైదరాబాద్ ను రోల్ మోడల్ సిటీగా మార్చుతామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇంకా ఎన్నో అభివఅద్ధి చేయాల్సినవి ఉన్నాయని వెల్లడించారు. ప్రజల కోసమే కాంగ్రెస్ పని చేస్తుందని తెలిపారు.

## పతంజలి కేసులో తీర్పు రిజర్వు

**- బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునిచ్చిన సుప్రీం**

న్యూఢిల్లీ (ప్రజా మంటలు):

పతంజలి కంపెనీకి సంబంధించిన తప్పుడు ప్రకటన కేసులో సుప్రీంకోర్టు తన నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు వ్యక్తిగత హాజరు నుంచి సర్వోన్నత న్యాయస్థానం మినహాయింపును ఇచ్చింది. అఫిడవిట్ దాఖలు చేసేందుకు సైతం సమయం ఇచ్చింది. అఫిడవిట్‌లో తప్పుదోవ పట్టించే ప్రకటనలను వెనక్కి తీసుకోవడానికి పతంజలి ఎలాంటి చర్యలు తీసుకున్నది.. ఉత్పత్తుల స్టాక్స్ గురించి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఇండియన్ మెడికల్ అసోసియేసన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా ధర్మాసనం విచారణ జరుపుతున్నది.కోవిడ్ వ్యాక్సినేషన్, అల్లోపతికి వ్యతిరేకంగా పతంజలి ప్రచారం చేసిందని ఐఎంఏ ఆరోపించింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా పంతజలిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆరోపించిన తప్పుదోవ పట్టించే ప్రకటనలను పతంజలి ప్రింట్ మీడియాలో ప్రచురించింది. జనవరి 3, 2024న జరిగిన విచారణలో పతంజలిపై ధిక్కార చర్య తీసుకున్నందుకు బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ధిక్కార నోటీసులు జారీ చేసినా స్పందన లేకపోవడంతో.. ఇద్దరిని వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. బాబా రామ్‌దేవ్, ఆచార్య బాలకృష్ణ క్షమాపణలు కోరారు. ఆ క్షమాపణలను కోర్టు తిరస్కరించింది. తప్పుడు ప్రకటనలపై క్షమాఫనలు కోరుతూ పత్రికల్లో యాడ్స్ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మళ్లీ 7న విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పతంజలిని మందలించింది. గత నెల 23న జరిగిన విచారణ సందర్భంగా ఐఎంఐకి సైతం సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది.ఈ విషయం కేవలం ఒక సంస్థకు (పతంజలి) పరిమితం కాదని కోర్టు పేర్కొంది. తప్పుదోవ పట్టించే ప్రకటనల ద్వారా ఉత్పత్తులను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతున్న మిగతా సంస్థలపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించింది. అల్లోపతి వైద్యులు తమ ప్రిస్క్రిప్షన్‌లో నిర్దిష్ట బ్రాండ్‌ల ఖరీదైన మందులను ఎందుకు సూచిస్తారని.. ఐఎంఏను ప్రశ్నించింది. తెలిసి ఖరీదైన మందులను రాసే వైద్యుల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలనే నిబంధన ఉందా? అంటూ జాతీయ వైద్య కమిషన్‌ను ప్రశ్నించింది సుప్రీంకోర్టు. మీరు ఒకరిని వేలెత్తి చూపిస్తే.. మరో నాలుగు వేళ్లు మీ వైపు చూస్తాయని కోర్టు పేర్కొంది. అయితే, సుప్రీంకోర్టు వ్యాఖ్యలు దురదృష్టకరమని ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వీ అశోకన్ పేర్కొనగా.. దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసిన కోర్టు.. నోటీసులు పంపుతూ సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

## బీజేపీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు

**- లక్ష్మణ్ అతిగా ఊహించుకుంటున్నారు - మీడియా సమావేశంలో జగ్గారెడ్డి వ్యాఖ్య**

హైదరాబాద్ (ప్రజా మంటలు): లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని.. ఎక్కడా అధికార దుర్వినియోగం జరగలేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఓటర్లు కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి తమ ఓటును వినియోగించుకున్నారని అన్నారు. ఎన్ఇనకలు ప్రశాంత నిర్వహణకు తాము కూడా సహకరించామని అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో తాము అధికారంలో ఉన్నాం కదా అని ఎవరికి ఇబ్బంది కలిగేంచేలా ప్రవర్తించలేదని చెప్పారు. పోలీసులు వ్యవస్థని దుర్వినియోగం చేయలేదన్నారు. స్వేచ్ఛగా ప్రశాంతంగా ఎన్నికలు జరిపించటంలో కాంగ్రెస్ ప్రభుత్వం సక్సెస్ అయిందని తెలిపారు.బీజేపీ అవాస్తవాలు మాట్లాడుతోందన్నారు. తమ ప్రభుత్వ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని వివరించారు. దేవుళ్లను అడ్డుపెట్టుకుని బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. 65 సీట్లు ఉన్న కాంగ్రెస్ ఎందుకు పడిపోతుందని బిజెపి నేత లక్ష్మణ్‌ను ఆయన ప్రశ్నించారు. లక్ష్మణ్ ప్రెస్ మీట్ ద్వారా కాంగ్రెస్ పార్టీపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ ఎంపీ లక్ష్మణ్ పండితుడు లెక్క జాతకాలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఆగస్టులో కాంగ్రెస్ గవర్నమెంట్ సంక్షోభంలో పడుతుందని లక్ష్మణ్ ఎలా అన్నారని నిలదీశారు. బీఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేస్తారు అనటంలో అర్థం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు తమ పథకాలతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ నాయకులు గందరగోళం అవుతూ ప్రజలను కూడా గందరగోళంలో పడేస్తున్నారని అన్నారు. హామీలు ఇచ్చి ఎగనామంపెట్టడంలో బీజేపీ నాయకులు దిట్టలని విమర్శలు గుప్పించారు. ప్రతివిషయంలో బీజేపీ నేతలు దేవుడిని అడ్డం పెట్టుకుని ప్రగల్భాలు పలుకుతారని విమర్శించారు. మోసం అంటే ఎలా ఉంటుందో కూడా కాంగ్రెస్‌కి తెలియదన్నారు. చెప్పిన పని ఇచ్చిన మాట చేయడం మాత్రమే కాంగ్రెస్ పార్టీకి తెలుసునని అన్నారు.

## వికారాబాద్‌లో విషాదం

**- పెంపుడు కుక్క దాడిలో ఓ 5 నెలల పసికందు మృతి**

దాడి చేసింది. శిశువు అరుపులు విన్న తల్లిదండ్రులు పరుగున ఇంట్లోకి వచ్చి చూసేసరికి బాలుడు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే తాండూర్ జిల్లా ఆసుపత్రిలోని మాతా-శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లగా, బాబును పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పటి వరకు తల్లి పొత్తిళ్లలో హాయిగా ఆడుకుంటూ ఉన్న చిన్నారి, అంతలోనే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.ఈ ఘటన స్థానికంగా కలకలం రేపగా, విషయం తమ మీదకు రాకుండా యూనిట్ యజమాని బాబును చంపిన కుక్కను చంపేశాడు. సమాచారం తెలుసుకున్న కారణకోట్? ఎస్సై విఠల్? రెడ్డి తన బృందంతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాబు తల్లి లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

### ఆదాయపు పన్ను కార్యాలయంలో మంటలు

న్యూఢిల్లీ (ప్రజా మంటలు):

దేశ రాజధాని ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఢిల్లీలోని ఆదాయపు పన్ను శాఖ కార్యాలయంలో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. మొదట ఐటీ ఆఫీసు వద్దకు 10 అగ్నిమాపక యంత్రాలు చేరుకుని మంటల్ని అదుపులోకి తెచ్చేందుకు యత్నించాయి. అంతలోనే మరో 11 ÷రిరజన్లు అక్కడికి చేరుకోవడంతో మొత్తం 21 ఫైరింజన్లతో మంటల్ని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని జాతీయ మీడియా రిపోర్ట్ చేసింది. మంటలు బిల్డింగ్ లో పలు అంతస్తులకు వ్యాపించడంతో ఐటీవోలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఊపిరి ఆడక కొందరు ఇబ్బంది పడ్డారు. రెస్క్యూ టీమ్,÷ర్ టీమ్ ఆఫీసులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొస్తున్నారు. రెస్క్యూ టీమ్ కాపాడిన వారికి ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమించిన వారిని అంబులెన్స్ లలో ఆసుపత్రులకు తరలిస్తున్నామని అధికారులు తెలిపారు.

## తిరుపతిలో పరిస్థితి అదుపులో ఉంది

పులిపర్తి నానికి ఆస్పత్రిలో చికిత్స - తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

తిరుపతి,మే14 (ప్రజా మంటలు):

చంద్రగిరి తెదేపా అభ్యర్థి పులివర్తి నానిపై దాడి ఘటన నేపథ్యంలో తిరుపతి ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ రంగంలోకి దిగారు. పద్మావతి మహిళా వర్సిటీకి చేరుకుని ఘటనా స్థలిని పరిశీలించారు. పరిస్థితిని సమీక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దాడిలో గాయపడిన పులివర్తి నాని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, క్షేమంగానే ఉన్నట్టు తెలిపారు. యూనివర్సిటీ వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందని చెప్పారు. ఈవీఎంలు భద్రపర్చిన స్టాం÷-రగ్ రూమ్ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటుచేశామని వెల్లడించారు. పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నం చంద్రగిరి నియోజకవర్గ కూటమి అభ్యర్థి పులివర్తి నానిపై వైకాపా శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో స్టాం÷-రగ్ రూమ్ పరిశీలనకు వెళ్లి తిరిగివస్తుండగా.. నానిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో నాని భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలవగా, కారు పూర్తిగా ధ్వంసమైంది. దాదాపు 150 మందికిపైగా వైకాపా కార్యకర్తలు రాడ్లు, కత్తులతో వచ్చి దాడి చేశారని తెదేపా నేతలు ఆరోపించారు. నడవలూరు సర్పంచి గణపతి ఆధ్వర్యంలో దాడి జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనను చెవిరెడ్డి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఓటమి భయంతోనే దాడులకు దిగారని ధ్వజమెత్తారు. చెవిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడికి పాల్పడిన వైకాపా మూకలను అరెస్టు చేసే వరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు.

## టిడిపి కార్యాలయంపై వైకాపా దాడి

### వాహనాల ధ్వంసంతో ఉద్రిక్తతలు

పల్నాడు,మే14(ప్రజా మంటలు):

పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైకాపా మూకలు మరోసారి రెచ్చిపోయారు. పోలింగ్ రోజు విధ్వంసం సృష్టించిన ఆ పార్టీ శ్రేణులు మంగళవారం కూడా దాడుల పరంపరను కొనసాగించారు. మంగళవారం మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేటసన్నెగండ్ల గ్రామానికి వెళ్తూ మధ్యలో కారంపూడిలో ఆగారు. ఈక్రమంలో ఒక్కసారిగా తెదేపా కార్యాలయంపై దాడికి దిగారు. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి, సమీపంలో ఉన్న వాహనాలను ధ్వంసం చేశారు. రోడ్డు పక్కన తెదేపా నేత జానీబాషా వాహనానికి నిప్పు పెట్టారు. దాడులను ఆపేందుకు యత్నించిన కారంపూడి సీఐ నారాయణస్వామిపై కూడా దాడికి తెగబడ్డారు. పట్టణంలో తీవ్ర భయానక వాతావరణం సృష్టించారు. తెదేపా కార్యాలయానికి సమీపంలో ఉన్న చిరువ్యాపారి పున్నమ్మ తోపుడు బండిని సైతం వైకాపా మూకలు ధ్వంసంచేశాయి. మాచర్ల నుంచి వచ్చిన వారు తన ఉపాధిని ధ్వంసం చేశారని పున్నమ్మ కన్నీరు పెట్టుకుంది.

## జనసునామి తట్టుకోలేకే దాడులు: టిడిపి

అమరావతి,మే14(ప్రజా మంటలు):

పోలింగ్ బూత్‌ల వద్ద జనసునామిని చూసి ఓర్వలేని జగన్, అతని గ్యాంగ్ దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నానిపై జరిగిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, వైసిపి అభ్యర్థులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుమారుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రగిరిలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని, దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. జూన్ 4న బ్యాలెట్ బాక్సులు తెరిస్తే.. వైసిపి నాయకులు రాష్ట్రం విడిచి పరారవుతారని, పగిన తలలకు, చిందిన రక్తానికి రెట్టింపు మూల్యం చెల్లించుకోవడానికి వైసిపి నేతలు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.

## ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై కేసు నమోదు

కడప,మే14 (ప్రజా మంటలు):

వైఎస్ఆర్ జిల్లా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డిపై మంగళవారం కేసు నమోదైంది. ఎమ్మెల్యేతో సహా ఆయన అనుచరులు 11 మందిపై పోలీసులు ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సోమవారం పోలింగ్ సందర్భంగా చాపాడు మండల పరిధిలోని చిన్నగులవలూరులో ఇద్దరు టిడిపి ఏజెంట్లు కుచ్చుపాప ఉగ్ర నరసింహులు, వినోద్‌లపై వైసిపి కార్యకర్తలు దాడి చేశారు. ఈ ఘటనలో ఇరువురికీ బలమైన గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని కర్నూలు ఆస్పత్రిలో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డితోపాటు పాలగిరి లక్ష్మీనారాయణరెడ్డి, మనీష్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సగిలి చంద్ర ఓబుళరెడ్డి, గంజికుంట హర్షవర్ధన్‌రెడ్డి, బోర్రా శంకర్‌రెడ్డి, ఏరాశి భాస్కర్‌రెడ్డి, పాలగిరి చంద్రమోహన్‌రెడ్డి, చంగా చంద్ర ఓబుల్‌రెడ్డిలపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, సోమవారం ఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్పి సిద్ధార్థ్ కౌశల్ వంద మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తామని చెప్పారు. 11 మందిపైనే కేసు నమోదు చేశామని చెప్పడం వెనుక ఎవరి ప్రమేయమైనా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## రెసిడెన్షియల్ పరీక్షా ఫలితాలు విడుదల

అమరావతి,మే14(ప్రజా మంటలు):

రాష్ట్రంలోని రెసిడెన్సియల్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, ఏపీఆర్ఐసీ సొసైటీ కార్యదర్శి నరసింహారావు తదితరులు మంగళవారం విడుదల చేశారు. ఏప్రిల్ 25న ఈ పరీక్షలు నిర్వహించగా తాజాగా ఒకేసారి ఫలితాలను విడుదల చేశారు. మార్కులు, రిజర్వేషన్, స్పెషల్ కేటగిరీ, స్థానికత ఆధారంగా ఆయా పాఠశాలలు, కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారు. ఫలితాలు పొందేందుకు విద్యార్థులు తమ క్యాండిడేట్ ఐడీ, పుట్టిన తేదీ, క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, ఈఈటీ, సీజీటీ గ్రూపుల్లో; పరీక్షలో అర్హత సాధించిన వారికి డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో పలు కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ పరీక్ష ద్వారా ఐదో తరగతిలో కొత్తగా ప్రవేశాలు కల్పించడంతో పాటు 6,7,8 తరగతుల్లో మిగిలివున్న సీట్లను భర్తీ చేయనున్నారు. రెసిడెన్సియల్ పాఠశాలల్లో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు నిర్వహించిన ఈ పరీక్షకు 25,216 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే, జూనియర్ కళాశాలల్లో ప్రవేశ పరీక్షకు 49,308 మంది, నాగార్జునసాగర్ డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్షకు 963మంది చొప్పున విద్యార్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు.

## బండి ఓటమి ఖాయం

### కరీంనగర్‌లో తనదే విజయమన్న వెలిచాల

కరీంనగర్,మే14(ప్రజా మంటలు):

కరీంనగర్‌లో పార్లమెంట్ పోలింగ్ 20-20 మ్యాచ్ లాగా సాగిందని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు అభిప్రాయపడ్డారు . బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ ఎన్ని డ్రామాలు చేసినా విజయం కాంగ్రెస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. తనకు టికెట్ కేటాయించే సమయానికి పోలింగ్ కు చాలా తక్కువ సమయం ఉన్నప్పటికీ.. 15 రోజులలో 15 లక్షల మందిని కలుసుకున్నాని తెలిపారు. హుజురాబాద్, సిరిసిల్లలో జరిగిన జనం జాతర సభలు విజయవంతం అయ్యాయని చెప్పుకొచ్చారు. కరీంనగర్ లో చేపట్టిన జన జాతర సభకు ప్రకృతి అనుకూలించకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి రాలేకపోయారన్నారు. 70 వేల మందితో చరిత్రలో నిలిచిపోయే విధంగా కరీంనగర్ లో రోడ్ షో చేపట్టామన్నారు వెలిచాల. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో సక్సెస్ కాగలిగిందని వెల్లడించారు. తనకు ఓటేసిన ఓటర్లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ హామీలు అమలు చేసే వరకు పోరాటం: కొప్పుల

పెద్దపల్లి,మే14(ప్రజా మంటలు):

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లాలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలయ్యేంత వరకు ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు. సింగరేణి కార్మికులకు ఐటీ మినహాయింపు, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడ్డ గులాబీ సైనికులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా నిత్యం ప్రజా సమస్యలపై ఉద్యమిస్తానని స్పష్టం చేశారు.

**వరంగల్‌లో స్ట్రాంగ్ రూమ్‌లకు ఇవిఎంలు - భద్రతను పరిశీలించిన పోలీస్ కమిషనర్**

వరంగల్,మే14(ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఎంతో ఉత్సాహంగా ఓటు హక్కు వినియోగించుకొని తమ బాధ్యతను నెరవేర్చారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో భద్రంగా నిక్షిప్త మయ్యాయి. కాగా, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి వరంగల్‌ఎనమాముల మార్కెట్‌లోని గోడౌన్లలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రత కోసం ఏర్పాటు చేసిన మూడు అంచల భద్రత ఏర్పాట్లపై ఆయన పోలీస్ అధికారులతో సమీక్ష జరిపారు.

# ఢిల్లీ-లక్నో హైవేపై కారు ప్రమాదం



## కారు పల్టీ కొట్టడంతో ఆరుగురు దుర్మరణం

లక్నో, (ప్రజా మంటలు): ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హాపూర్‌లోని గర్ కొత్వాలి ప్రాంతంలో ఢిల్లీ-లక్నో హైవేపై మంగళవారం ఓ కారు అదుపుతప్పి మరో వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆరుగురు మృతి చెందినట్లు హాపూర్ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాజ్‌కుమార్ అగర్వాల్ తెలిపారు. మరణించిన వారిని ఇంకా గుర్తించలేదని.. బాధితుల వివరాలను సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారని చెప్పారు.

# సొంత ఇల్లు..కారు లేని మోడీ

## రూ.3.02 కోట్ల విలువైన ఆస్తులు - అఫిడవిట్‌లో ప్రకటించిన ప్రధాని



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తనకున్న ఆస్తుల వివరాలను వెల్లడించారు. రూ.3.02 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని ప్రకటించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థిగా వారణాసిలో ఆయన సోమవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా అఫిడవిట్‌లో తన ఆస్తుల వివరాలను పొందుపరిచారు. అందులో తన పెట్టుబడులు, స్థిర, చరాస్తులను డిక్లేర్ చేశారు. 2014లో మోదీ డిక్లేర్ చేసిన ఆస్తులతో పోల్చుకుంటే 2019లో ఆస్తులు స్వల్పంగా పెరిగాయి. 2014లో తన ఆస్తి విలువ రూ1.66 కోట్లు ఉన్నట్టు ఆయన డిక్లేర్ చేశారు. 2019లో అది రూ.2.51 కోట్లకు పెరిగినట్టు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కాగా, తాజాగా ఆయన ప్రకటించిన ఆస్తుల వివరాల ప్రకారం, రూ.2.67 లక్షలు విలువచేసే నాలుగు బంగారు ఉంగరాలు ఉన్నాయి. అదనంగా, రూ.9.12 లక్షలు విలువచేసే నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ ఉన్నాయి. ఎన్ఎస్‌సీలో ఆయన పెట్టుబడి 2019లో 7.61 లక్షల నుంచి సుమారు రెండు లక్షలు పెరిగింది. దీనికితోడు, రూ.2.85 కోట్లు బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఈఆబ) రూపంలో ఉన్నట్టు 2024 అఫిడవిట్ తెలిపింది. అయితే, ప్రధానికి ఎలాంటి భూములు కానీ, ఇల్లు, కారు, షేర్లు, మ్యూచుఫల్ పండ్స్‌లో పెట్టుబడులు కానీ లేవు. ఆయన చేతిలో రూ.52,920 నగదు మాత్రమే ఉంది. ప్రభుత్వ జీతం, బ్యాంకుల నుంచి వడ్డీలను తన ఆదాయ మార్గాలుగా మోదీ ప్రకటించారు. తన భార్య ఆదాయమార్గాలు తనకు తెలియవని ఆయన తన అఫిడవిట్‌లో స్పష్టం చేశారు. అలాగే, తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు కానీ, ప్రభుత్వ బకాయిలు కానీ లేవని ఆయన ప్రకటించారు. ఇకపోతే 1978లో దిల్లీ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్.. 1983లో గుజరాత్ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ పూర్తి చేసినట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇప్పటివరకు తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని తెలిపారు. ఏడో దశలో భాగంగా జూన్ 1న వారణాసిలో పోలింగ్ జరగనుంది.

# నేను రాజ్యాంగ పరిరక్షకుడను

## దానిని మారుస్తాననడం పచ్చి అబద్ధం



### ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడీ

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): రాజ్యాంగాన్ని మార్చనున్నారంటూ విపక్షాలు తనపై చేస్తున్న ఆరోపణలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తోసిపుచ్చారు. తాను రాజ్యాంగ పరిరక్షకుడనని చెప్పారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో మంగళవారంనాడు నామినేషన్ వేసిన అనంతరం ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలపై మోదీ సమాధానమిచ్చారు. 'కాశీ' అనేది కేవలం ఒక మాట కాదని, అదొక భావోద్వేగమని వారణాసితో తనకు ఉన్న అనుబంధాన్ని మోదీ తెలియజేశారు. కాశీ ఎప్పటికీ చెక్కుచెదరదని, శతాబ్దాలుగా ఇది జనావాసంగా ఉందని చెప్పారు. గత పదేళ్లుగా కాశీతో తన అనుబంధం పెరుగుతూ వచ్చిందన్నారు. గంగా మాత అక్కున చేర్చుకుందనే అనుభూతి తనను ఎంతగానో ప్రభావితం చేస్తోందని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో తనకు ఎదురైన అనుభవాలను, అప్పుడప్పుడు మధ్యలో ప్రసంగాన్ని ఆపి పెద్దలు, దివ్యాంగులు కనిపించినప్పుడు కనిపించినప్పుడు వారికి సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయమని కోరడంపై ప్రధాని మాట్లాడుతూ, ప్రజలతోనూ, వారి ఆలోచనతోనూ తాను కనెక్ట్ అవుతుంటానని చెప్పారు. జీవంలేని రోబోలా కేవలం ప్రసంగాలు ఇవ్వడం, పూర్తికాగానే వెళ్లిపోవడమనేది తన ప్రపంచం కాదని తెలిపారు. విపక్షాలు తనను ఆడిపోసుకోవడంపై మాట్లాడుతూ, ఇలాంటి వాటిని తాను పెద్దగా పట్టించుకోనని చెప్పారు. 'నేను ఎగ్జిట్ కాకముందే వాళ్లు ఇలాంటివి మొదలుపెట్టారు. నేను వెళ్లిపోయిన తర్వాత కూడా వారు ఇదే తీరు కొనసాగిస్తారని అనుకుంటున్నాను' అని వ్యాఖ్యానించారు. భగవంతుడు ఒక ప్రత్యేక పని మీద తనను పంపినట్టుగా భావిస్తుంటానని, తనకు అప్పగించిన పనని కొనిసాగిస్తూనే ఉంటానని మోదీ స్పష్టం చేశారు.

# ఎన్నికల నియమావళి ఉల్లంఘినంచిన ప్రధాని

## సుప్రీంలో పిటిషన్ వేయగా తిరస్కరించిన న్యాయస్థానం




### ఇసికి ఫిర్యాదు చేయాలని సూచన

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఆరోపిస్తూ.. ఎన్నికల్లో పోటీ చేయకుండా ప్రధాని నరేంద్ర మోదీపై ఆరేళ్ల పాటు నిషేధం విధించాలని ఓ పిటిషన్ దాఖలైంది. అయితే.. దీనిని సుప్రీంకోర్టు మంగళవారం తోసిపుచ్చింది. ఇలాంటి వ్యవహారాలపై ఎన్నికల సంఘాన్ని సంప్రదించాలని న్యాయస్థానం సూచించింది. దీంతో.. ఆ పిటిషనర్ తన పిటిషన్‌ని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఫాతిమా అనే మహిళ ఆనంద్ ఎస్ జొంధాలే అనే న్యాయవాది ద్వారా ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ప్రధాని మోదీ విద్వేషపూరిత ప్రసంగాలు చేశారని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. కాబట్టి.. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రధాని మోదీపై ఆరేళ్లపాటు ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. అయితే.. ఈ పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, ఎస్‌సీ శర్మ నేతృత్వంలోని ధర్మాసనం.. ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించింది. అసలు మీరు ఎన్నికల అధికారుల్ని సంప్రదించారా? మాండమస్ రిట్ కోసం మీరు ముందుగా అధికారుల్ని సంప్రదించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే పిటిషనర్ తన పిటిషన్‌ని ఉపసంహరించుకున్నారు. కాగా.. ఇంతకుముందు కూడా ఢిల్లీ హైకోర్టులో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా ఇలాంటి పిటిషన్ దాఖలైంది. దాన్ని కూడా కోర్టు తిరస్కరించింది. ఈ వ్యవహారంపై పిటిషనర్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాడని, అది ఎన్నికల సంఘం పరిశీలనలో ఉన్నప్పుడు కోర్టుని ఆశ్రయించడం సరికాదని న్యాయస్థానం పేర్కొంది. ఏ విధంగా చూసినా ఈ పిటిషన్ విచారణకు అర్హత లేదని పేర్కొంది.

## ప్రసంగాలతో జాగ్రత్త - అగ్రనేతలకు ఇసి హెచ్చరిక

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): దేశంలో లోక్‌సభ ఎన్నికల సందడి కొనసాగుతోంది. మొత్తం ఏడు విడతల పోలింగ్‌లో ఇప్పటివరకు నాలుగు విడతలు ముగిశాయి. మరోవైపు.. ప్రచారంలో భాగంగా ప్రధాన పార్టీలు తమదైన విమర్శనాస్త్రాలతో ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నాయి. ఈ క్రమంలోనే ప్రచార ఉపన్యాసాల విషయంలో అగ్ర నేతలకు ఎన్నికల సంఘం కీలక సూచనలు చేసింది. ఎన్నికల వేళ ఆయా పార్టీల అగ్ర నాయకుల నుంచి మంచి ప్రసంగాలను ఆశిస్తారని.. దీంతో వారు ఆమేరకు నడచుకోవాలని సూచించింది. దేశ సామాజిక నిర్మాణాన్ని దెబ్బతీయకుండా ఉండేందుకుగాను తదుపరి ప్రచారంలో తమ ప్రసంగాలను సరిదిద్దుకోవాల్సిన బాధ్యత వారిపై ఉందని స్పష్టంచేసింది. మార్చి 16న సార్వత్రిక ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే దేశవ్యాప్తంగా ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. ఈక్రమంలోనే ఎన్నికల కోడ్ అమలుపై ఈసీ తాజాగా తన రెండో నివేదికను విడుదల చేసింది. తమవద్ద నమోదైన 90 శాతానికిపైగా ఫిర్యాదులను పరిష్కరించినట్లు వెల్లడించింది. కాంగ్రెస్, భాజపాకు సంబంధించిన కొన్ని ఫిర్యాదులు మినహా ఆయా పార్టీల నుంచి వచ్చిన పెద్ద కేసులేవీ పెండింగ్‌లో లేవని తెలిపింది. 'దేశంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి దాదాపు రెండు నెలలు పూర్తయ్యింది. ఇప్పటివరకు జరిగిన ప్రచారం చాలావరకు హింసారహితంగా, ప్రలోభాలు, గందరగోళానికి తావులేకుండా సాగింది' అని పేర్కొంది. జూన్ 1న చివరి దశ పోలింగ్ ముగియనుండగా.. 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# స్వాతి మలివాల్‌పై అసభ్య ప్రవర్తన నిజమే

## అంగీకరించిన సీనియర్ నేత సంజయ్ సింగ్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ తనపై దాడి చేశాడని ఆప్ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ చేసిన ఆరోపణలు నిజమేనని ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్ సింగ్ చెప్పారు. కార్యదర్శి బిభవ్ కుమార్ సోమవారం సీఎం అధికారిక నివాసంలో ఎంపీ స్వాతి మలివాల్‌తో అసభ్యంగా ప్రవర్తించారని, ఈ విషయంలో కేజ్రీవాల్ కఠిన చర్యలు తీసుకుంటారని ఆప్ సీనియర్ నేత సంజయ్ సింగ్ తెలిపారు. ఈ ఘటనపై మే 14వ తేదీ మంగళవారం సంజయ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. 'సోమవారం ఎంపీ మలివాల్, అరవింద్ కేజ్రీవాల్‌ను ఆయన నివాసంలో కలవడానికి వెళ్ళారు. ఆమె డ్రాయింగ్ రూమ్‌లో సీఎంను కలవడానికి వేచి ఉండగా.. బిభవ్ కుమార్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఇది అత్యంత ఖండించదగిన ఘటన. కేజ్రీవాల్ దీనిపై ఆగ్రహం ఉన్నారు. ఈ సంఘటనపై కఠిన చర్యలు తీసుకుంటారు' అని తెలిపారు. మలివాల్ సోమవారం సివిల్ లైన్స్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. అరవింద్ కేజ్రీవాల్ వ్యక్తిగత సిబ్బంది సీఎం అధికారిక నివాసంలో తనపై దాడి చేసినట్లు ఆరోపించారని పోలీసు అధికారులు తెలిపారు.

# టీడీపీ, వైసీపీ శ్రేణులు రాళ్ల దాడులు

## తాడిపత్రిలో తీవ్ర ఉద్రిక్తత..టియర్ గ్యాస్ ప్రయోగం

తాడిపత్రి, (ప్రజా మంటలు): తాడిపత్రిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ, వైసీపీ శ్రేణులు రాళ్ల దాడులు చేసుకోగా.. సిఐ మురలీకృష్ణ తలకి గాయాలయ్యాయి. సోమవారం టీడీపీ నేత సూర్య ముని ఇంటిపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం పీఎస్ వద్ద జేసీ ప్రభాకర్ ధర్నాకు దిగారు. తర్వాత ఆయన పెద్దారెడ్డి ఇంటివైపు కార్యకర్తలతో వెళ్తుండగా వైసీపీ శ్రేణులు అక్కడికి చేరుకోవడంతో.. ఉద్రికత చోటు చేసుకుంది. ఈ క్రమంలో టీడీపీ, వైసీపీ శ్రేణులు రాళ్ల దాడులు చేసుకున్నారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అయితే పోలింగ్ సమయంలో వైసీపీ పలు అల్లర్లు, అరాచకాలు సృష్టించింది. పలు జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై వైసీపీ మూకలు పెద్దఎత్తున దాడులకు పాల్పడుతున్నాయి. అనంతపురం జిల్లాలోని తాడిపత్రిలో మరోసారి వైసీపీ అల్లరి మూకలు దాడులకు తెగడుతున్నాయి. తాడిపత్రి పట్టణంలో తెలుగుదేశం పార్టీ జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటిపై వైసీపీ కార్యకర్తలు రాళ్ల దాడులకు పాల్పడ్డారు. వైసీపీ నేత కేతిరెడ్డి పెద్దారెడ్డి అనుచరులు రాళ్లదాడి చేశారు. ఈ రాళ్లదాడిలో పలువురు టీడీపీ నేతలు, అడిషనల్ ఎస్పీ రామకృష్ణకు తీవ్రగాయాలు అయ్యాయి. ఎస్పీని స్థానిక ఆస్పత్రికి తరలించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటి వద్ద వైసీపీ శ్రేణులు పెద్దఎత్తున చేరి రాళ్ల దాడులకు పాల్పడుతున్నాయి. వైసీపీ నేతలను అడ్డుకోడానికి టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారు. వైసీపీ, టీడీపీ నేతలు పరస్పరం రాళ్ల దాడులు చేసుకుంటున్నారు. ఇరు వర్గాలను పోలీసులు చెదరగొట్టారు. తాడిపత్రి టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి వైపు టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి, అనుచరులు దూసుకుపోతున్నారు. దాడులను అడ్డుకోవడానికి పోలీసులు బాష్ప వాయువును ప్రయోగించారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటికి, పెద్దారెడ్డి ఇంటికి మధ్యలో ఉన్న కాలేజీ గ్రౌండ్ రణరంగంగా మారింది. కార్యకర్తలను చదరగొట్టేందుకు పోలీసులు ్ఞ÷రిరగ్ ఓపెన్ చేశారు. దీంతో తాడిపత్రిలో తీవ్ర టెన్షన్ నెలకొంది.

## తిరుపతిలో టిడిపి ఆందోళన..లాఠీఛార్జ్

తిరుపతి, (ప్రజా మంటలు): తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీ వద్ద ఈ సాయంత్రం చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ దాడిని నిరసిస్తూ టీడీపీ శ్రేణులు పద్మావతి వర్సిటీ రోడ్డుపై బైఠాయించి.. పులివర్తి నాని అనుచరులు నిరసన తెలిపారు. ఈ నేపథ్యంలో, పోలీసులు రంగప్రవేశం చేసి నిరసనకారులపై లాఠీ చార్జి చేసి, వారిని అక్కడ్నించి చెదరగొట్టారు. తొలుత సాధారణ పోలీసులు రాగా, వారితో టీడీపీ నేతలకు వాగ్వాదం జరిగింది. తమకు న్యాయం చేయాలని టీడీపీ కార్యకర్తలు కోరారు. ఈ దశలో ప్రత్యేక బలగాలు రంగప్రవేశం చేసి టీడీపీ కార్యకర్తలపై లాఠీ చేశారు.

## ఎన్నికలు ముగిశాక ఎఐఎం రిగ్గింగ్

### రియాసత్ నగర్ బూత్ 40లో ఈ ఘటన

### హైదరాబాద్ బిజెపి అభ్యర్థి మాధవీలత ఆరోపణ

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలో ఎన్నికలు ముగిసిన తరువాత ఎంఐఎం నేతలు రిగ్గింగ్ చేశారని హైదరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవీ లత సంచలన ఆరోపణలు చేశారు. చంద్రాయణ్ గుట్టలోని రియాసత్ నగర్ బూత్ నంబర్ 40లో రిగ్గింగ్ జరిగిందని ఆమె ఆరోపించారు. ఆ సమయంలో ఒక్క అధికారి, పోలీసు కూడా అక్కడ లేరని పేర్కొన్నారు. హిజాబ్ ధరించి ఉన్న దాదాపు 150కి పైగా యువతులు, మహిళల్ని వేరే చోటు నుంచి తీసుకొచ్చి వారితో దొంగ ఓట్లు వేయిస్తున్నారని సమాచారం అందగానే అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. అసదుద్దీన్ ఒవైసీ పదే పదే హిట్లర్ పేరు ప్రస్తావిస్తారు.. హిట్లర్ రాజ్యమంటే ఇలాగే ఉంటుందంటూ మండిపడ్డారు. బతికున్న ఎంతో మందిని చని పోయారని చెబుతూ ఓటు వేయకుండా అడ్డుకున్నారని, రాక్షస రాజ్యానికి అంతం లేదా అని ప్రశ్నించారు. ఎంత పిలిచినా తలుపులు తెరవలేదు.. తాను పోలింగ్ బూత్ కు వెళ్లగా రిగ్గింగ్ జరిగినట్లు గుర్తించానని, అక్కడ పోలీసులు, అధికారులు లేరని మాధవీలత తెలిపారు. కిటికీల నుంచి వీడియోలు తీయగా.. రిగ్గింగ్ జరిగినట్లు, లోపల మనుషులు ఉన్నట్లు గుర్తించామన్నారు. తాను ఎక్కడికి వెళ్తే అక్కడికి ఎంఐఎం మనుషులు, పోలీసులు వస్తున్నారని.. సెక్యూరిటీగా బీజేపీ కార్యకర్తలు ఉంటే, వారిపై సైతం బెదిరింపులకు పాల్పడుతున్నారని మీడియాకు తెలిపారు. పోలీసులు సైతం వారికి మద్దతుగా నిలిచారని, గంటసేపు తాను అక్కడే ఉండగా.. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వచ్చి ఎంత సేపు డోర్ కొట్టినా, పిలిచినా లోపల నుంచి ఎవరూ స్పందించకపోవడం దారుణమన్నారు. ఎక్కడైనా పోలింగ్ బూత్ మీద ఇళ్లు ఉంటుందా, ఇక్కడ అందుకు భిన్నంగా ఉందని చెప్పారు. మొఘల్ పురాలో అసదుద్దీన్ ఒవైసీ సమక్షంలో 500 మంది కలిసి ర్యాలీ చేశారు. తన మీద ఇష్టం ఉన్నట్లు అరుస్తూ బండ బూతులు తిడుతూ దుర్మార్గంగా ప్రవర్తించినట్లు తెలిపారు. వెంటనే సీఆర్పీఎఫ్ సిబ్బంది స్పందించి తనను సేఫ్ గా కారులో తరలించారని చెప్పుకొచ్చారు. గో÷-డలెన్ జూబ్లీ స్కూళ్లో ఓ మైనర్ ను పట్టుకోగా, మైనర్ అని రాస్తామన్నారు. ఈరోజు హాలిడే అని రేపు కేసు నమోదు చేస్తామని చెబుతున్నారని వాపోయారు. కొందరు పోలింగ్ బూత్ లో ఓటు వేసి బయటకు వచ్చాక, షర్ట్ మార్చుకుని వెళ్లి మరో ఓటు వేసి రావడం చూశామన్నారు. ది ప్రజాస్వామ్యం కాదా, 21వ శతాబ్దంలో లేమా అని మాధవీ లత ప్రశ్నించారు. దొంగ ఓట్లు వేస్తున్నారని, మీరు చెక్ చేయండని చార్మినార్ ప్రాంతంలో లేడీ కానిస్టేబుల్ ను తాను అడగగా.. తమకు ఎలాంటి సూచనలు లేవని, తమకు సంబంధం లేదని చెప్పడాన్ని తప్పుపట్టారు. బురఖా తీసి చెక్ చేయాలని కోరగా, ప్రిసైడింగ్ ఆఫీసర్ కు తమ సహాయం కావాలని అడిగితే మాత్రమే చెక్ చేస్తామన్నారు. లేకపోతే అక్కడ రిగ్గింగ్ జరిగినా, దొంగ ఓట్లు వేసినా, దుర్మార్గం జరిగినా చూస్తు కూర్చుంటామన్నట్లు పోలీసులు వ్యవహరించారని మాధవీ లత ఆరోపించారు. ఇన్ని రోజులు తాను చేసింది పాదయాత్ర కాదని, ఓట్లు డిలిట్ అయిన వారి వివరాలు తీసుకుని ఇంటింటికి పాదయాత్ర చేసి చూపిస్తానన్నారు. ప్రతి బూత్ లో 150 నుంచి 200 హిందువుల ఓట్లు తొలగించారని, ఈ అన్యాయాలను చూస్తూ సహించేది లేదన్నారు.

# మిగతా మూడు దశల్లో మార్పు వచ్చేనా

## కాంగ్రెస్ నినాదాల్లో కానరాని స్పష్టత

## ప్రజల్లో భరోసా కల్పించలేక పోతున్న నేతలు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): కాంగ్రెస్‌లో మార్పు కనిపించడం లేదు. ప్రజలకు చేరువయ్యే ప్రకటనలు రావడం లేదు. కేవలం డబ్బుల పంపిణీ, మహిళల ఖాతాల్లో లక్ష జమవంటి పథకాలతో ఎన్నికల్లో గట్టెక్కాలని చూస్తోంది. కర్నాకట తరవాత తెలంగానలో అధికారం రావడంతో అలాంటి పథకాలతో కాంగ్రెస్ మేనిఫెస్టో రూపొందించి ముందుకు సాగుతోంది. కర్నాటకలో బిజెపి అవినీతి, తెలంగాణలో కెసిఆర్ అహంకారం వల్ల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేశారు. అంతేగాని సంస్థాగతంగా కాంగ్రెస్ బలంగా ఉందనడానికి లేదు. కాంగ్రెస్ ఉచిత హామీలు ఏ మేరకు ఫలించాయన్నది రేపటి ఫలితాల్లో తేలనుంది.

దేశంలో అతి పెద్ద రాష్ట్రం అయిన ఉత్తర ప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కేవలం 2.32 శాతం మాత్రమే సంపాదించింది. ఉత్తరాఖండ్‌లో అధికారంలో ఉన్న బిజెపిని ఓడించే పరిస్థితులు ఉన్నప్పటికీ గెలిపించగల నాయకత్వం లేదని రుజువు చేసుకుంది. పంజాబ్‌లో ఆఖరి రోజుల్లో ముఖ్యమంత్రిని తొలగించి, ఆచరణ సాధ్యం కాని ప్రయోగాలు చేసి కుప్పకూలిపోయింది. 30 మంది కాంగ్రెస్ అభ్యర్థులు పంజాబ్‌లో డిపాజిట్ కోల్పోయారు. పదేళ్ల క్రితం కాంగ్రెస్ అధికారంలో ఉన్న అనేక రాష్ట్రాల్లో ఆ పార్టీ పరిస్థితి అగమ్య గోచరంగా ఉన్నది. 2014లో కాంగ్రెస్ 13 రాష్ట్రాల్లో అధికారంలో ఉండేది. ఇప్పుడు కేవలం మూడు రాష్ట్రాలకే పరిమితమైంది. 2013కు ముందు 15 సంవత్సరాల పాటు కాంగ్రెస్ ఢిల్లీలో అధికారంలో ఉండేది. 2020 ఎన్నికల్లో ఆ పార్టీకి ఢిల్లీలో కేవలం 5 శాతం ఓట్ల కంటే తక్కువ వచ్చాయి. 63 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోయారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పూర్తిగా తుడిచి పెట్టుకుని పోయింది. ఢిల్లీ, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ తలరాతని మార్చగలిగిన శక్తి ఇప్పుడున్న ముగ్గురు నేతలకు లేదు. అయితే కాంగ్రెస్ ఇప్పటికీ మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఎంతో కొంత బలంగా ఉన్నది. ఇందులో కర్నాకట, తెలంగాణల్లో అధికారం దక్కించుకుంది. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా క్రింది స్థాయి నుంచి పార్టీలో జవజీవాలు కల్పించాల్సి ఉన్నది. గ్రామ స్థాయినుంచి పార్టీని బలోపేతం చేయాల్సి ఉన్నది. దళితులు, వెనుకబడిన వర్గాలు మళ్లీ కాంగ్రెస్ పట్టులోకి వచ్చేందుకు ఏమిచేయగలమా అని ఆ పార్టీ నేతలు ఆలోచించాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ జనంలో కదలిక తేగలిగిన పరిస్థితిలో ఉన్నదా లేదా, తెచ్చేందుకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అని ఆ పార్టీ నేతలే చర్చించుకోవాలి. జనంలో కదలిక రావాలంటే జనాన్ని ఆలోచింపచేసే ఒక సిద్ధాంతం, లేదా నినాదం అవసరం. ఎలాంటి నిర్ణయాలు తీసుకుని వెళితే ప్రజలు నమ్ముతారన్నది ముఖ్యం. ఆ దిశగా ఆలోచన చేయాలి. లేకుంటే కాంగ్రెస్ చరిత్రపుటల్లో మాత్రమే కనిపిస్తుంది. అందుకు మిగిలిన మూడు దశల ఎన్నికల్లో అయినా సంయమనంతో, స్పష్టతతో ముందుకు సాగాల్సి ఉంది. అప్పుడే కాంగ్రెస్‌ను నమ్ముతారు. మైఆనర్టీ ఓట్ల కోసం వెంపర్లాడితే మెజార్టీ ప్రజల తిరస్కరణకు గురికాక తప్పదు.

# సైద్ధాంతిక భావజాలంతో బిజెపి దూకుడు రాజకీయాలతో పట్టు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): భారతీయ జనతా పార్టీకి ఒక సైద్ధాంతిక భూమిక ఉన్నది. పద్ధతి ప్రకారం అది తన సిద్ధాంతాన్ని జనంలోకి చొచుకునిపోయేలా చేస్తున్నది. కాంగ్రెస్ వారసత్వాన్నీ, సిద్దాంతాన్నీ, ఆ పార్టీ నేతలను చరిత్ర పుటల్లోంచి తొలగించి తన సిద్ధాంతాన్ని, భావ జాలాన్ని ప్రవేశ పెట్టేందుకు బిజెపి పకడ్బందీగా పనిచేస్తోంది. కాంగ్రెస్ పార్టీకి ఓటు బ్యాంకు అయిన దళితులు, ఆదివాసీలను తన వైపుకు తిప్పుకునేందుకు, ఓబీసీలను ఆకర్షించేందుకు బిజెపి పద్ధతి ప్రకారం ప్రయత్నిస్తోంది. అదే ఇప్పుడు కాంగ్రెస్‌ను పూర్తిగా దెబ్బతీసి బిజెపిని బలపడేలా చేస్తోంది. కరిమింగిన వెలగపండులా కాంగ్రెస్ డొల్లగా మారినా ఈ నిజాన్ని గుర్తించడం లేదు. ప్రతి రాష్ట్రంలోనూ పలుకుబడిగల వివిధ వర్గాల నేతలు బిజెపిలో చేరేందుకు ఉత్సుకత ప్రదర్శిస్తున్నారు. మోడీ కూడా ఎప్పటికప్పుడు ప్రజల్లో తన సమర్థ నాయకత్వ లక్షణాల ద్వారా ఆకట్టుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ కానీ, ఆ పార్టీతో కలిసి పనిచేసే శక్తులు కానీ ఒక ప్రత్యామ్నాయ రాజకీయ సిద్దాంతాన్ని పటిష్ఠం చేసుకుని దాన్ని జనంలో ఉధృతంగా ప్రవేశపెట్టనంతవరకూ ఆ పార్టీకి ఊపు వచ్చే అవకాశాలు లేవు. బిజెపికున్న భావజాలాన్ని మార్చలేరు. తెలంగాణలో కేసిఆర్‌కు మించిన రాజకీయజ్ఞానం ఎవరికీ లేదనుకున్నారు. కానీ ఆయన అహమే గత ఎన్నికల్లో దెబ్బకొట్టింది. అలాకాకుండా ప్రజలకు చేరువయ్యేలా కార్యక్రమాలు ఏ పార్టీకైనా అవసరం. ఎంతటి వారినైనా సైద్ధాంతికంగా దెబ్బకొట్టగల ఘనులు బిజెపిలో ఉన్నారు. అంబేద్కర్, మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి, పివి నరసింహారావు వంటి నేతల్ని బిజెపి సొంతం చేసుకుని జనంలో వారి గురించి చెబుతున్నా కాంగ్రెస్ పార్టీ నిశ్చేష్టగా చూస్తున్నది. మొన్నటికి మొన్న పివికి భారతరత్న ఇవ్వడం ద్వారా కాంగ్రెస్‌ను మోడీ దెబ్బకొట్టారు. స్వాతంత్య్ర సమరయోధులను స్మరిస్తున్నా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోవడం లేదు. పైగా తమ పార్టీయే స్వాతంత్య్రాన్ని తెచ్చిందని చెప్పుకుంటుంది. తన మార్కు దేశభక్తిని బిజెపి జనంలోకి ప్రవేశపెడుతున్నా నివ్వెరపోయి చూస్తున్నదే తప్ప చెప్పుకోవడానికి పెద్దగా స్పందించడం లేదు. ఈ క్రమంలోనే తెలంగాణలో పెద్ద ఎత్తున ప్రచారకార్యక్రమాలు బిజెపి సాగిస్తోంది. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో రెండంకెల సీట్లు సాధిస్తామని ధీమాగా ఉంది. కెసిఆర్‌ను అదేపనిగా విమర్శింస్తోంది. తెలంగాణకు ఏం చేశారంటే చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. అయినా అంతా తమ చలవే అన్నచందంగా బిజెపినేతలు ప్రచారం గుప్పించారు. తెలంగాణకు ఒక్క ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్, ట్రిపుల్ ఐటీ, ఎన్ఐడీ, మెడికల్ కాలేజీలు, నవోదయ పాఠశాలలు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం ఎందుకు విఫలమైందో చెప్పాలని గతంలో బిఆర్ఎస్ ప్రశ్నించినా ప్రజల్లో పెద్దగా స్పందన రాలేదు.

# అంచనాకు అందని ఓటరునాడి

## పెరిగిన ఓటింగ్ శాతంతో అందరిలోనూ ధీమా - రాష్ట్రవ్యాప్తంగా 3శాతం వరకు పెరిగిన ఓట్లు

హైదరాబాద్ (ప్రజా మంటలు): ఓటరు నాడిని అంచనా వేయడం అంత సులువైన పనికాదని పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మరోసారి నిరూపించింది. గతంలో ఓటు వేసిన తరువాత ఓటరు ఏదో ఒకరకంగా తానెవరివైపు మొగ్గుచూపారో చెప్పకనే చెప్పే పరిస్థితులు ఉండేవి. ఐదు నెలల క్రితం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కానీ, సోమవారం లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో కానీ పోలింగ్‌బూత్‌కు వచ్చిన ఓటరు తన అభిప్రాయాన్ని వెల్లడించేందుకు సుముఖత చూపలేదు. ఫలితంగా అభ్యర్థులు, ఆయా పార్టీల్లో మరింత ఉత్కంఠ పెరిగింది. ఈ ఎన్నికలు ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలం అన్నది ఓటింగ్ సరళిని బట్టి అర్థం చేసుకోవడం కష్టంగా మారింది. అయితే పార్టీలన్నీ తమకే అనుకూలమని చెప్పుకుంటున్నాయి. ఒక పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. అక్కడి మొత్తం ఓటర్లు, నమోదైన పోలింగ్ శాతం, అందులో పార్టీల వారీగా పోలైన ఓట్లను అంచనా వేయడం, అదీ మౌనముద్రలోకి జారుకున్న ఓటరు స్థితిని పరిగణనలోకి తీసుకొని అంచనా వేయడం దుర్లభమే అవుతుందని రాజకీయ పరిశీలకులకు చెప్తున్నారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు సోమవారం పోలింగ్ ముగిసిన తర్వాత ప్రజల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ సాయంత్రానికి వేగం పుంజుకుని గత ఎన్నికల పోలింగ్ శాతాన్ని అందుకున్నది. ఆరేడు స్థానాల్లో రాష్ట్ర పోలింగ్ సగటు కన్నా ఎక్కువ పోలింగ్ శాతం నమోదైంది. పట్టణ ఓటరు కన్నా గ్రామీణ ఓటరే ఎక్కువ చైత న్యం ప్రదర్శించాడు. ఫలితంగా పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. ఐదు నెలల క్రితం రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న పరిస్థితికి, సోమవారం నాటి లోక్‌సభ ఎన్నికలకు ఏమాత్రం పొంతన లేకుండా పోయింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోటీపడిన అభ్యర్థులు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ శ్రేణులు పోలింగ్‌బూత్‌ల వద్ద మోహరించాయి. ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎవరు ఓట్లు వేశారు? ఎవరు వేయలేదో సరిచూసుకొని ఓటు వేయనివారిని పోలింగ్‌బూత్‌లకు రప్పించాయి. సోమవారం మాత్రం అటువంటి దృశ్యాలు కనిపించలేదు. జహీరాబాద్, మెదక్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం వంటి స్థానాల్లో రాష్ట్ర సగటు పోలింగ్‌శాతం కన్నా ఎక్కువగా నమోదైంది. హైదరాబాద్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్ల స్థానాల్లో రాష్ట్ర సగటుకన్నా తక్కువగా రికార్డు అయింది. ఎక్కువగా నమోదైన పోలింగ్ ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలం, పోలింగ్‌శాతం తక్కువగా నమోదైన నియోజకవర్గాల్లో ఎవరు లాభపడతారనేది అంచనాకు అందడం లేదు. జాతీయ పార్టీలు రెండూ తొలి నుంచీ ద్విముఖ పోటీగానే భావించాయి. ఈ భావనను, వాటి ఆశలను బీఆర్ఎస్ తలకిందులు చేసిందని పోలింగ్ సరళిని బట్టి అర్థమవుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా 65 శాతం నమోదైంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నమోదైన 62.72 శాతం కన్నా ఈసారి ఎక్కువగా నమోదు కావడం గమనార్హం. ఈ శాతంలో కొంత మార్పు ఉండే అవకాశం ఉన్నది. జహీరాబాద్, మెదక్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గాల్లో 70 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో 62.72 శాతం పోలింగ్ శాతం నమోదు కాగా ఫలితాలు ఆశ్చర్యపరిచాయి. 2018లో రెండోసారి 88 అసెంబ్లీ స్థానాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ 9 ఎంపీ స్థానాలను గెలుచుకున్నది. మొత్తం మీద ఈ పెరిగిన పోలింగ్‌శాతం రాష్ట్రంలోని కాంగ్రెస్‌కు, కేంద్రంలో మూడోసారి అధికారం కో సం పోటీపడుతున్న బీజేపీకి కలిసి వస్తుందా? లేదంటే, తెలంగాణ బీఆర్ఎస్‌కు కలిసివస్తుందా అన్నది ఉత్కంఠగా మారింది.

## అమ్మ చెప్పింది వంటిల్లే వైద్యశాల!



ఇల్లంతా ఒకటే సందడి చేస్తూ తిరుగుతోంది అమ్ములు. అమ్మ ఎక్కడుంటే తనూ అక్కడే ఉంటోంది. అమ్మ చెయ్యి పట్టుకుని వెనకాలే పరుగులు తీస్తు అన్ని గమనిస్తూ ఉంటుంది. రోజూ పాఠశాలకు వెళ్ళ రావడం అక్కడ ఇచ్చిన ఇంటి పని పూర్తి చేయడం ఆ పై అమ్మతో గడపటం అమ్ములుకు అలవాటు. ఈ ఉదయాన్నే నిద్ర లేచి అమ్మను వెతకడం ప్రారంభించిది అమ్ములు. రోజూ నిద్రలేపే అమ్మ ఇప్పుడు కనపడటం లేదు. ఎక్కడని నాన్నను అడిగితే పక్కింటికి వెళ్ళిందని చెప్పారు. నిద్ర మత్తులో కళ్ళు పులుముకుంటూ వెళ్ళి చూసే సరికి అమ్మ పక్కన ఇంటిలో ఉండే అక్కతో కూర్చొని ఇంటి ప్రక్కన రాళ్ళ పొయ్యిపై ఒక మూకుడు పెట్టి అందులో మంచి నూనె పోసి, ఇంటి వెనకవైపునున్న చెట్ల ఆకుల్ని బాగా నలిపి రసం అందులోకి పిండి, బాగా మరిగాక దాన్ని చల్లార్చి ఒక గిన్నలోకి తీసి ఇస్తూ "దీన్ని ఆ ప్రాంతంలో రోజురు రెండుసార్లు రాయండి ఆ నవ్వలు తగ్గి పుండుమాని పోతుంది" అని చెప్పింది.

మాష్టారు పిల్లలకు వార్షిక పరీక్షలు ముగిసాక ఒక సమావేసం ఏర్పాటు చేసి అందరినీ వాళ్ళ పెద్దయ్యాక ఏమేమి అవ్వదలచుకున్నరో చెప్పమన్నారు. అందరూ వారికి నచ్చిన రంగాన్ని ఎంచుకొని చెప్పడం ప్రారంభించారు. ఇంతలో అమ్ములు వంతురాగానే "మాస్టారూ , నేను మా ఇంటిని వైద్యశాలగా మార్చివేస్తానండి" అని అన్నది.
" అంటే నువ్వు డాక్టర్ అవుతావా అమ్ములు "అన్నారు మాస్టారు.
"లేదండి నేను మా ఇంటిని వైద్యశాలగా మార్చేస్తా , మా అమ్మ గారు చేసినట్టు "అంది.
అర్ధంకాని మాష్టారు అదెలాగో చెప్పమన్నారు
" మా ఇంట్లో అమ్మ అన్ని జబ్బులకు వైద్యం, అలాగే అవి రాకుండా ముందు జాగ్రత్త చర్యలకు కావలసిన వన్నీ మన వంటిట్లోన్ ఉన్నాయి" అని చెప్పింది.
'రోజూ ఉదయం లేవగానే మా నానమ్మ, తాతయ్యలకు వంటిట్లో కాసిన్ని నాన బెట్టిన మెంతులు ఇస్తుంది . వాటిని రోజు ఉదయం నమిలితే మధుమేహం రాకుండా ఉంటుంది అని చెప్పింది, ఇంకా ఎవరికైనా రొంప, దగ్గు లాంటివి వస్తే వెంటనే కషాయం చేసి ఇస్తుంది. ఏ జబ్బుకైనా మన వంటిట్లో ఉండే దినుసులు మంచి ఔషదాలని చెప్పింది అమ్మ.
మిరియాలు, ధనియాలు, మెంతులు, జీలకర్ర, వాము, పసుపు, ఇంగువ, లవంగాలు, అబ్బో ఇలా ఒకటా రెండా ఇంట్లో ఉండే వాటితో ఒక పెద్ద వైద్యశాలకు వెళ్ళే అవసరమే లేకుండా చెయ్యొచ్చని చెబుతుంది.
అయినా వీటి కోసమేనట కదా ఒకప్పుడు తెల్ల వాళ్ళు మన దేశంలోకి వ్యాపారం కోసం వచ్చి ఆక్రమించి, వాటిని వాళ్ళ దేశంలో వాణిజ్యం కోసం తీసుకొని వెళ్ళే వాళ్ళు అని ఒక సారి చరిత్ర పాఠంలో మీరే చెప్పారు కదండి "అంది అమ్ములు.




"అమ్ములు చెప్పింది నిజం జబ్బు వచ్చిన తరువాత చేసే చికిత్స కన్నా అది అసలు రాకుండా చేసుకునే నివారణే అతిముఖ్యం. అందుకు మనకు సహాయపడే వనరులు ఈ మన వంటిట్లోనే ఉంటాయి. మీ ఇంట్లో
అమ్మను అడగండి ప్రతి ఒక్క దానికి ఒక ప్రాముఖ్యత ఉంది " అన్నారు మాస్టారు.
" మాస్టారు మరి నూనెలు ఎలా ఉపయోగ పడతాయి ? " అంటూ సందేహంగా అడిగాడు చింటు.
" వేప నూనె, కానుగ నూనె, కొబ్బరి నూనె, ఆముదం, నువ్వుల నూనె, ఇవన్ని మంచి ఓషద గలవి వీటిని మనం వాడే ప్రస్తుత మందులలో కూడా వాడుతారు. చర్మవ్యాదులకు, ఇంటి అవసరాలకు బాగా ఉపయోగ పడతాయి. ఇంట్లో పనికి రాని వస్తువు అంటూ ఉండదు. మీరు ఇంటికి వెళ్ళి అమ్మ చేసే పనులు గమనించండి అందులో బోలెడు అర్థం దాగుంటుంది" అన్నారు మాస్టారు.

ఆమాటలకు సరే అంటూ ఉత్సుకతతో ఇంటికి పరుగులు తీసారు పిల్లలు.

సింగంపల్లి శేష సాయి కుమార్
రాజంపేట. 8639635907

## ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం

యాదాద్రి,మే 14 (ప్రజామంటలు):



విష్ణుమూర్తి యొక్క దశావతారాలలోని 4వ అవతారమే నరసింహస్వామి అవతారం. నృసింహ జయంతి వైశాఖ శుక్ల చతుర్ధతి నాడు జరుపుకొంటారు. నరసింహస్వామి రూపంలో దేహం మానవ రూపం, తల సింహం రూపంలో అవతరించిన దేవుడు. నృసింహస్వామి మాహా శక్తి వంతమైన అవతారంగా చూడాలి. ఇదే రోజున విష్ణుమూర్తి హిరణ్యకశిపుడిని సంహరించి, ధర్మాన్ని నిలబెట్టాడు కాబట్టి నృసింహ జయంతిని వేడుకగా జరుపుకొంటారు. నృసింహ జయంతి వృత్తాంతం ప్రకారం ప్రహ్లాదుడి కోసం ఆయనజన్మించారు. హిందూ పురాణాల ప్రకారం త్రిమూర్తులలో విష్ణువు లోకపాలకుడు. సాధు పరిరక్షణ కొరకు, దుష్టశిక్షణ కొరకు ఆయన ఎన్నో అవతారాలలో యుగయుగాన అవతరిస్తాడు. అలాంటి అవతారాలలో 21 ముఖ్య అవతారాలను ఏకవింశతి అవతారములు అంటారు. వానిలో అతి ముఖ్యమైన 10 అవతారాలను దశావతారాలు అంటారు. ఈ దశావతారాలలో నాలుగవ అవతారము నారసింహావతారము. మహాలక్ష్మిని సంబోధించే 'శ్రీ' పదాన్ని చేర్చి శ్రీనారసింహుడని ఈ అవతార మూర్తిని స్మరిస్తారు. హిరణ్యకశ్యపుడిని అంతమొందించి, ప్రహ్లాదుడినికాపాడే లక్ష్యంతో ఈ అవతారం ఏర్పడింది.

## "ఓటు విలువ"

తల రాతలు మార్చే ఆయుధం
భవిష్యత్తుకు భరోసా ఓటు
పవిత్రమైన ఓటును అమ్మకు
నీ ఓటుకున్న శక్తిని చూపించు

ఓటును వినియోగించకుంటే
అభివృద్ధి ఆమడ దూరంలోనే
నచ్చిన వ్యక్తికే వేయాలి ఓటు
ప్రజాస్వామ్యానికి ఊతమియ్యి

తాయిలాలు వద్దే వద్దు
మందు విందులు అసలే వద్దు
నోటుతో ఓటు వృథా చేయకు
రాజ్యాంగం ఇచ్చిన హక్కు ఓటు

ఓటు విలువ తెలియజెప్పు
ప్రజాస్వామ్యం పై విశ్వాసం కలిగించు
అయిదేండ్లకోమారు వచ్చె ఓటు
చీకటి జీవితాల్లో నింపు వెలుగు

యాడవరం చంద్రకాంత్ గౌడ్
సిద్దిపేట, 9441762105

## "కుటుంబముతో కలిసి ఉందాం.. కుటుంబ వ్యవస్థను పటిష్టం చేద్దాం"



అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ప్రతి సంవత్సరం మే 15న విశ్వ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుచున్నప్పటికి, సమాజంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న విషయాన్ని గుర్తించి, కుటుంబాల విలువలను తెలియజేయడం కోసం,ఉమ్మడి కుటుంబాల అవసరము గురించి వివరించడం కొరకు ఈ రోజును ప్రత్యేకంగా కేటాయించారు. పూర్వకాలంలో మాదిరిగా ప్రస్తుతం ఉమ్మడి కుటుంబాలు ఉండడంలేదు. ఒంటరితనం పెరిగిపోయి వ్యసనాలకు బానిసలు కావడం, పట్టించుకునేవారు లేకపోవడంతో విచ్చల విడిగా బ్రతకడం,పిల్లలకు సంస్కృతి సాంప్ర దాయం తెలియ చేసే తాతలు, అమ్మలు లేకపోవడం, క్షణికావేశములో నేరస్తులుకావడం, వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. కుటుంబ వ్యవస్థ బలహీనమవ్వడం మూలంగా సమాజంలో జరిగే నష్టాలను మరియు తీవ్ర పరిణామాలను గ్రహించిన ఐక్యరాజ్య సమితి కుటుంబ వ్యవస్థను పటిష్టం చేయడంకోసం 1993, మే 15న అంతర్జాతీయ కుంటుంబ దినోత్సవం జరుపుకోవలెనని నిర్ణయించింది. కుటుంబ వ్యవస్థను కాపాడుకోవడం అనే అంశాన్ని వివరిస్తూ ప్రజా చైతన్యంకోసం ప్రపంచవ్యాప్తంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించి కుటుంబ వ్యవస్థ యొక్క ప్రాధాన్యతను వివరించడమే లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. విచ్ఛిన్నమవుతున్న కుటుంబాల మధ్య తిరిగి ప్రేమానురాగాలు పెంపొందించాలనే ఉద్దేశంతో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ కుటుంబ దినోత్సవంను జరుపు కోవడానికి నిర్ణయించింది. కుటుంబ సమైక్యత గురించి ప్రజలందరికీ అవగాహన కలిగించడం, కుటుంబ పెద్దల నైపుణ్యాన్నీ మరియు అనుభవాలను పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి లక్ష్యాలతో ఈ రోజును జరుపు కుంటున్నాము.
కుటుంబ వ్యవస్థ మన సమాజం మనకు ఇచ్చిన ఒక గొప్ప అరుదైన కానుకగా భావించవచ్చు. కుటుంబం అనేది సమాజంలో ఒక ముఖ్యమైన భాగం. ఈ ప్రత్యేకత కారణంగా, కుటుంబం వ్యక్తిని జాతికి అనుసంధానం చేస్తూ వసుధైక కుటంబము అనే దిశలో ప్రయాణానికి తోడ్పడుతున్నది. సామాజిక, ఆర్థిక భద్రతకు ఒక సంపూర్ణ వ్యవస్థ కావడంతో పాటు, కొత్త తరానికి సంస్కారాలు, విలువలు నేర్పే ముఖ్యమైన మాధ్యమంగా కూడా కుటుంబం వ్యవహరిస్తుంది. కుటుంబ వ్యవస్థ వల్ల సమాజానికి మనం ఇచ్చే సందేశం ఎంతో గొప్పది. ప్రపంచదేశాల్లో భారతదేశ కుటుంబ వ్యవస్థలా మరెక్కడా లేకపోవడం అనేది మన ధర్మం యొక్క గొప్పతనంగా భావించవచ్చు.
భారతీయ సంస్కృతిసంప్రదాయాలకు, నాగరికత అభివృద్ధి కి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. పూర్వకాలం నుండి మనదేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని చరిత్ర ద్వార మనకు తెలిసిందే. మనదేశంలో ఉమ్మడి కుటుంబాల వారు ఆనందంగా ఉన్నారని మన చరిత్ర ద్వారా మనం తెలుసుకున్న నిజం. ఒక కుటుంబంలో తాత,అమ్మ మొదలు వారి పిల్లలు వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి కుటుంబంలో ఉండేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇస్తూ, ఆయన మాటే వినేవారు. ఆ కుటుంబా లలో పెద్దల సంరక్షణలో పిల్లలు ఆనందంగా ఉండేవారు. కష్ట సుఖాలు సమానంగా పంచుకునే ఆత్మీయులు, ఆపదలో ఆదుకునే బంధుమిత్రులతో ఒంటరితనము అనే భావన లేకుండా ఆనందంగా గడిపిన కుటుంబాలెన్నో ఉన్నాయి. కానీ నేడు చూస్తే, ఉమ్మడి కుటుంబాలుగా ఉన్న ఎన్నో కుటుంబాలు ఆధునిక ప్రపంచంలో చిన్నకుటుంబాలుగా మారాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కలసి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ను దెబ్బతీసింది. నేటి ఆధునిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది. డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించుకునే సమయం లేదంటే మనకుటుంబ వ్యవస్థ ఎంత బలహీన పడిందో అర్థం చేసుకోవచ్చు. అందరూ డబ్బు సంపాదించే యంత్రాలుగా మారి, తల్లి దండ్రులను చూసుకొనే తీరికలేక వృద్ధాశ్రమలలో వేస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి ఉండే మనసులు కానీ మనుషులు కానిలేక, పెళ్లయిన వెంటనే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఉండి కూడా మొబైల్ ఫొన్ చేతిలో పట్టుకొని ఒంటరై పోతున్నారు. సలహాలు సూచనలు ఇచ్చే పెద్ద వారు లేక, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు రాక, కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు ఉండక, జీవితమంటే విసుగువచ్చే స్థాయికి నేటి యువత వెళ్లిందంటే కారణాలను గుర్తించాల్సిన అవసరం ఉంది. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కాకుండా కాపాడుకుంటూ, ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యతను గుర్తించవలసిన అవసరం ఎంతైనా ఉంది. కుటుంబ వ్యవస్థ ముఖ్యోద్దేశాలు పిల్లలకు సమాజంలో ఒక స్థానాన్ని కల్పించడం, సంస్కృతిని వారికి అందజేయడం, ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దడం గా ఉండాలి.
ఆడవారు, మగవారు వేరు వేరు పనులు పంచుకొని జీవనాన్ని సాగిస్తూ శ్రమ విభజనకు ఒక ఉదాహరణగా ఉంటుంది. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. కేవలం ఫోన్‌లోనో, మొబైల్‌లోనో యోగక్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా ఉన్నాయంటే విచారకరం. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టిల్లు. ఇప్పుడు అలాంటి ఉమ్మడి కుటుంబాలున్న వారిని వెతికినా దొరకడం లేదు. అనేక కుటుంబాలు వ్యక్తిగత, చిన్న చిన్న కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం చూస్తున్నాం, అలాంటి తగాదాలను కుటుంబ పెద్దలుంటే సర్దిచెప్పి ఒకరిపై ఒకరికి నమ్మకం కలిగించేవారు. సమన్వయం లోపించడం వల్ల విడాకులు తీసుకున్న వ్యక్తులు ఎందరో ఉన్నారు. కాబట్టి ఉమ్మడి కుటుంబ ప్రాధాన్యతను గుర్తించి వీలైనంత ఎక్కువ సమయాన్ని మనవలు మనవరాండ్రతో గడిపే అవకాశం మీ తల్లిదండ్రులకిస్తూ నీతి కథలు,పౌరాణిక కథలు చెప్పే అవకాశం ఇస్తూ కలిసి మెలసి ఉండి ఉమ్మడి కుటుంబ వ్యవస్థను బలపరిచేలా చేద్దాం. గౌరవం,త్యాగం, సంయమనం, ప్రేమ, ఆత్మీయత, ఓర్పు,ఒకరికొకరు సహకరించు కోడం, సంతోషకరమైన ఉమ్మడి కుటుంబానికి మార్గాలుగా భావించి ఈ లక్షణాలను కుటుంబ సభ్యులందరు కలిగివుండేలా కృషిచేస్తే ఆనంద జీవనం అందించవచ్చు. సమాజానికి విలువలు నేర్పడంలో "ఎలక్ట్రానిక్ మీడియా మరియు ప్రింట్ మీడియా" మంచి సాధనాలు. కుటుంబ వ్యవస్థ గురించి మంచి కథనాలు ప్రచురించడం, అలాగే స్ఫూర్తిదాయకంగా చిత్రాలు తీయడం,ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించడం,చట్టాల రూపకల్పన చేసేటప్పుడు ప్రభుత్వాలు కుటుంబ వ్యవస్థ పటిష్టపరిచే విధంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల కొంతైనా మార్పు వస్తుందని భావిద్దాం.

గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత.
9963499282

## స్వార్ధమే పరమార్ధం.. కుటుంబ వ్యవస్థ అస్తవ్యస్తం..



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

కుటుంబం అనగా ఒకే గృహంలో నివసించే కొంత మంది బంధువుల సమూహం. వీరు సాధారణంగా పుట్టుకతో లేదా వివాహముతో సంబంధ మున్నవారు.




భారతీయ సంస్కృతికి, సంప్రదాయాలకు, నాగరికత పురోగతికి మూలమైనది ఉమ్మడి కుటుంబ వ్యవస్థ. నాగరికత విస్తరణకు పూర్వమే మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉందని వివిధ గ్రంథాలలో పొందు పరచబడి ఉంది. నాగరిక ప్రపంచంలోనూ మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మూడుపువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లింది. ప్రాచీన కాలం నుండి ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదలతో తూల తూగాయనడంలో సందేహం లేదు. ఒక కుటుంబంలో తాత మొదలు వారి పిల్లలు, వారి పిల్లలు ఇలా మూడు నుంచి నాలుగు తరాలు ఉమ్మడి అనే గొడుగు కింద ఒదిగి పోయేవి. ఇంటి లోని పెద్దకు అందరూ గౌరవం ఇవ్వాల్సిందే. ఆయన మాటే వేదవాక్కు. అందరిదీ ఉమ్మడి వ్యవసాయమే. సమష్టి సంపదనే, సమష్టి భోజనాలే ఉండేవి. ఆత్మీయత అనురాగం, ఉట్టి పడేలా చేసేవి. తల్లిదండ్రులు, అత్తమామలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, బావా మరదళ్లు, బంధు మిత్రులు, తాతలు, బామ్మలు, మనవలు, మనవ రాండ్రతో కళకళలాడే ఉమ్మడి కుటుంబాలు సిరి సంపదల నిలయాలు. పిల్లలు చిన్న వయస్సులో ఉన్నపుడు తల్లిదండ్రుల చెంతనే ఉంటారు. వారు పెద్దవారై పెళ్ళిళ్ళు అయిపోతే ఎవరి కుటుంబాలు వారివే. అంటే ఒక కుటుంబం నుంచి మరిన్ని కుటుంబాలు ఉదయిస్తాయి. ఒక కుటుంబం మరెన్ని కుటుంబాలను సృష్టించినప్పటికీ వంశవృక్షపు వేళ్ల మూలాలు మాత్రం మొదటి కుటుంబంను అల్లుకునే ఉంటాయి. అందుకే సంవత్సరంలో ఒక రోజైనా అందరూ కలుసు కోవాలని సరదాగా గడపాలని కోరుకోవడం అత్యంత సహజం. ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో.

విదేశీ పాలకుల పాలనలో ఉమ్మడి కుటుంబాలుగా చెలామణి అయిన ఎన్నో కుటుంబాలు నవనాగరిక ప్రపంచంలో విచ్ఛిన్న మయ్యాయి. ఆధునికత పెరగడం, నాగరికత పురోభివృద్ధి, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం వెరసి ఉమ్మడి వ్యవస్థ మీదా తీవ్ర ప్రభావాన్ని చూపింది. నవ నాగరిక ప్రపంచంలో రెండు కుటుంబాలు కాదు కదా రెండు మనసులు కూడా కలసి జీవించ లేని పరిస్థితి నెలకొంది.

ఆధునిక యుగంలో ఒకే ఇంట్లో ఉన్నప్పటికీ ఒకరినొకరు పలుకరించుకునే సమయం చిక్కని కుటుంబాలు ఎన్నో. కేవలం ఫోన్‌లోనో, మొబైల్‌లోనో యోగ క్షేమాలు కనుక్కునే కుటుంబాలు కూడా లేకపోలేదు. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలకు మనదేశం పుట్టిల్లు. ఇప్పుడు ఆ సంస్కృతి భూతద్దం పెట్టి వెతికినా దొరకదంటే అతిశయోక్తి కాదు. అనేక కుటుం బాలు వ్యక్తిగత కారణాలతో విచ్ఛిన్నం కావడం మనం రోజూ చూస్తూ ఉన్నదే. అయినప్పటికీ మన దేశంలో అనేక కుటుంబాల మధ్య కనిపించే అన్యోన్యతా భావం మరే దేశంలోనూ కనిపించదు.

డబ్బు సంపాదన కోసం కనీసం భార్యభర్తలు కూడా ఒక చోట కూర్చుని ఒకరినొకరు పలకరించుకునే సమయం చిక్కడం లేదంటే కుటుంబాలు ఎంతగా విచ్ఛిన్న మయ్యాయో అర్థం చేసు కోవచ్చు. ఉమ్మడి కుటుంబాలలో కలిసి మెలిసి మనగలిగే మనస్తత్వాలు లోపించి పెళ్లయిన మరు నాడే వేరు కాపురాలు పెట్టుకుని జంటలుగా ఒంటరై పోతున్నారు. దీంతో సలహాలిచ్చే పెద్ద దిక్కులు లేకపోవడం, ఆపదలో ఆదుకునే ఆత్మీయులు దూరం కావడం, కనీసం మనసులోని బాధలను పంచుకునే బంధువులు కరువవ్వడం నేటి సమాజంలో మనకు నిత్యం కనిపించే దృశ్యం.

కుటుంబ దౌర్జన్యం చట్టం 498-ఎను దుర్వినియోగం చేయడం ద్వారా కొందరు భార్యలు, భర్తలతో పాటు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు బనాయించి వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. బోగస్ వరకట్న కేసులు బనాయించడం ద్వారా దేశవ్యాప్తంగా వేల మంది పురుషులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే పురుషులు వివాహం చేసుకోవడానికి వెనుకంజ వేసే పరిస్థితి వస్తుంది. భార్యాభర్తల మధ్య చోటు చేసుకున్న విభేదాలు న్యాయస్థానం వెలుపలనే పరిష్కరించు కోవడం సముచితంగా ఉంటుందని అనుభవజ్ఞుల భావన. సమాజంలో వివిధ మతపరమైన వివాహ చట్టాలు కుటుంబ వ్యవస్థను గుర్తించాయి. "రక్త సంబంధము, సహచరత్వము, ఒకే నివాసం అంశాల విషయంలో కుటుంబ నైతిక, సామాజిక సూత్రాలు కుటుంబ సమైక్యత, సంఘటితం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన సమయమిది.
జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సుస్థిర కుటుంబాలకు దోహదం చేయడం, నైపుణ్యాన్నీ, అనుభవాలను, సామాజిక విలువలను పరస్పరం పంచుకుంటూ కుటుంబ సమస్యల విషయంలో సరైన సమాచారాన్ని, సహకారాన్ని అందించడం, కుటుంబాలలో నెలకొన్న విభేదాలను తొలగించి ఆయా కుటుంబాలలో సుఖశాంతులు నెలకొల్పడం వంటి అంశాలపై నేటి తరానికి అవగాహన కల్పించాల్సిన తరుణమిది.

## ఎన్నికల విధులు నిర్వహించి వచ్చి గుండెపోటుతో ఫిజికల్ డైరెక్టర్ మృతి




మంచిర్యాల మే 14 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలోని గోపాలవాడకు చెందిన ఉపాధ్యాయుడు ఫిజికల్ డైరెక్టర్ గడి కొప్పుల సదానందం గుండెపోటు తో మృతి. ఎన్నికల విధులలో భాగంగా నిన్న బెల్లంపల్లి సెంటర్లోని కాశీపేట మండలం మల్కపల్లి లో పి.ఓ. గా గడి కొప్పుల సదానందం డ్యూటీ చేసి వచ్చి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతి చెందారు.

## మోరపల్లి లో అగ్నిప్రమాదం, గడ్డికట్టలు అగ్నికి ఆహుతి




జగిత్యాల రూరల్, మే 14(ప్రజా మంటలు):
రూరల్ మండలం మోరపల్లి లో బేతి రామ్మోహన్ రెడ్డి కి చెందిన కొట్టంలో ఉన్నగడ్డి కట్టలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని అగ్ని ప్రమాదం సంభవించగా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు 60,000 రూపాయల విలువ చేసే గడ్డికట్టలు అగ్నికి ఆహుతి. ఫైర్ సిబ్బంది ఇన్చార్జి ఫైర్ ఆఫీసర్ జి మధు, లీడింగ్ ఫైర్ మాన్ జీ రవీందర్, డ్రైవర్ ఆపరేటర్ ఏ. మల్లేశం, ఫైర్ మెన్లు బి. శ్రీనివాస్, కే. మహర్షి, జి. శ్రీనివాస్ పాల్గొన్నారు.





కరీంనగర్ లో అల్లుడితో సరదాగా బేకరీ వెళ్లిన బండి సంజయ్. అక్కడే కూర్చొని అల్లుడితో తిన్నక్రీ పఫ్.

## గాంధీనగర్ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమం
### ప్రతి మంగళవారం "ఆరోగ్య మహిళ" దినం



జగిత్యాల మే 14 (ప్రజామంటలు):
జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్ ఆరోగ్య కేంద్రం లో ప్రతి మంగళ వారము ఆరోగ్య మహిళ కార్య క్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా, స్త్రీ సంబంధిత ప్రత్యేక చికిత్స, అంకాలజిస్ట్ కన్సల్టేషన్, వి ఐ ఎ,క్యాన్సర్ ట్రీట్ మెంట్, అల్ట్రా సౌండ్, మేమో గ్రామ్, పెప్సీమియం, తదితర పరీక్షలు నిర్వహిస్తారు. ప్రతి మంగళ వారం "ఆరోగ్య మహిళ" దినంగా పరిగణిస్తామని, జిల్లా ఉప వైద్యాధికారి డా. జైపాల్ రెడ్డి, స్త్రీ వైద్య నిపుణులు డా. చైతన్య రాణి తెలిపారు. ఈకార్య క్రమములో, హాస్పిటల్ సిబ్బంది, టెక్నీషియన్స్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

## జనగామ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం




జనగామ మే 14 (ప్రజామంటలు):
జనగామ హెచ్.పి. పెట్రోల్ బంక్ సమీపంలో మొబైల్ టిఫిన్ సెంటర్ ను అతివేగంతో వచ్చి ఢీకొన్న వరంగల్ 1 డిపో రాజధాని బస్సు. టిఫిన్ సెంటర్ వద్ద టిఫిన్ చేస్తున్నముగ్గురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా ఒక మహిళ ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. బాలుడు, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇలా పట్టణాలకు దూరంగా నిర్వహిస్తున్న టిఫిన్ సెంటర్ మేన్ రోడ్డులకు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని ప్రజలు కోరుతున్నారు. అసలు ఇలాంటి వాటికి పర్మిషన్లు ఇవ్వకూడదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

## మాణిక్యాపూర్ రేణుక ఎల్లమ్మ నూతన కమిటీ
### చైర్మన్ గా బుర్ర తిరుపతి, వైస్ చైర్మన్ గా గడ్డం శివ



భీమదేవరపల్లి మే 14 (ప్రజామంటలు):
మండలంలోని ఉమ్మడి మాణిక్యాపూర్ గ్రామంలో గౌడన్నల ఆరాధ్య దైవం, పూర్వీకుల ఆచార సాంప్రదాయాలకు, అనుగుణంగా దేవాలయ అభివృద్ధి చేస్తూ, రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం అన్నారు. ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ ఉమ్మడి మాణిక్యపూర్ దేవాలయం కమిటీ చైర్మన్ గా బుర్ర తిరుపతి, గడ్డం శివ (వైస్ చైర్మన్), బుర్ర తిరుపతి (కోశాధికారి), పాలకవర్గ సభ్యులుగా తీగల రాజు, దాసర కుమార్ స్వామి, బుర్ర కుమార్, బుర్ర తిరుపతి, బుర్ర రమేష్, బుర్ర వేణు, సట్ల రాజు, సట్ల శ్రీనివాస్ (పూజారి) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలి




మెట్ పల్లి మే 14 (ప్రజామంటలు):
మూడు నూతన చట్టసవరణ బిల్లులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ కె. పావని అన్నారు. మెట్ పల్లి లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడుతూ%ౌ%. గత సంవత్సరం భారత పార్లమెంట్ ఆమోదించిన భారతీయ న్యాయ సన్నిహిత బిల్లు, భారతీయ సాక్ష్య బిల్లు మరియు నాగరిక్ సురక్షా సన్నిహిత బిల్లులపై న్యాయధికారులు, న్యాయవాదులతో పాటు ప్రజలు కక్షిదారులు కూడా అధ్యయనం చేసి, అవగాహన పెంచుకోవాల్సి ఉందన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాధవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు ఎల్మల రాంబాబు న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, మగ్గిడి వెంకట నర్సయ్య, కోట రాజారెడ్డి, జేడీ సుధాకర్, పసునూరి శ్రీనివాస్, హరిభూషన్, నర్సయ్య, కోల అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ ఫలితాల్లో శ్రీనివాస రామానుజన్ విద్యార్థుల విజయకేతనం




ధర్మసాగర్ మే 14 (ప్రజామంటలు):
సీబీఎస్ఈ పదోతరగతి బోర్డు పరీక్ష ఫలితాల్లో హనమకొండలోని శ్రీనివాస రామానుజన్ స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ అరుణ రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 500 మార్కులకు గాను ఎస్. నవనీత్ 473, ఎస్. వినయ్ 401, వీ. రఘుపతి రెడ్డి 400 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. 473 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన నవనీత్ ను పాఠశాల యాజమాన్యం 10,000 రూపాయల నగదు బహుమతితో సన్మానించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పాస్ట్ డిస్టిక్ గవర్నర్ శ్రీ ముచ్చరాజి రెడ్డి మాట్లాడుతూ, నిపుణులైన ఉపాధ్యాయుల వల్లే తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో పాటు 100% రిజల్ట్ సాధించారన్నారు. తదనతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జగిత్యాల నిజామాబాద్ ప్రధాన రహదారిపై మేడిపల్లి వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మేడిపల్లికి చెందిన బోయినపల్లి సృజన్ రావు మృతి.

## లోక్సభ ఎన్నికల పోలింగ్ శాతాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ ఎం.పీ. అభ్యర్థి సుధీర్ కుమార్



వేలేర్ మే 14 (ప్రజామంటలు):
వేలేరు మండల కేంద్రంలోని పీచర గ్రామంలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు కలిసి పోలింగ్ శాతం అడిగి తెలుసుకున్న వరంగల్ పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నర్సింగరావు మండల కో ఆప్షన్ నెంబర్ మహమ్మద్ జానీ సమ్మక్క సారక్క దేవస్థానం చైర్మన్ కొయ్యడ మహేందర్, గ్రామ శాఖ అధ్యక్షులు మారబోయిన రాజు, పెడపెల్లి సిద్ధులు, వృద్ధుల శ్రీకాంత్, వేముల రాజు, జల్తారి రవి, మోరే రాజు, కొయ్యడ రమేష్, గడ్డి శంకర్ రావు, యూత్ సీనియర్ కార్యకర్తలు పాల్గొన్నారు.



జగిత్యాల పట్టణం లో నిన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో 36 వ వార్డు కు సంభందించిన బూత్ వద్ద పనిచేసిన కార్యకర్తలతో జగిత్యాల మున్సిపల్ చేర్ పర్సన్ అడువాల జ్యోతి, లక్ష్మణ్ దంపతులు.



పార్లమెంట్ ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న జగిత్యాల మున్సిపల్ చేర్ పర్సన్ అడువాల జ్యోతి, లక్ష్మణ్ దంపతులు

## రూ. 20 లక్షల బ్రెయిన్ సర్జరీ, వైద్యం ఉచితం
### దళితబిడ్డకు ప్రాణం పోసిన నీలిమ హాస్పిటల్
### సహకరించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



వేలేర్ మే 14 (ప్రజామంటలు):
జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం చేతిలో చిల్లి గవ్వలేదు. కనీసం హాస్పిటల్ ఖర్చులకు కూడా డబ్బులు లేవు. అయితేనేం మన రాజేశ్వర్రుడున్నాడు కధా అనే ధీమా వారిలో ఉంది. మెదడుకు సంబంధించిన వ్యాధితో జనగామ నియోజవర్గ పరిధి బచ్చన్నపేట గ్రామానికి చెందిన ఓ నిరుపేద దళిత బిడ్డ కొన్నేళ్లుగా బాధ పడుతున్నాడు. విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాడు. వివరాలు తెలుసుకున్న పల్లా ఆలస్యం చేయకుండా వెంటనే బాధితుడిని నీలిమ హాస్పిటల్ తీసుకెళ్లమని పురమాయించారు. సమాచారం అందుకున్న సిబ్బంది ఆ దళిత బిడ్డకు అన్ని రకాల పరీక్షలను ఉచితంగా చేశారు. దాదాపు రూ. 20 లక్షల ఖర్చు అయ్యే బ్రెయిన్ సర్జరీని నీలిమ హాస్పిటల్ వైద్యులు ఉచితంగా అందజేశారు. దీంతో బాధిత కుటుంబం ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే సార్ ఆ రాజరాజేశ్వరుడి లెక్క ఆదుకున్నాడని, వారికి తమ కుటుంబం రుణపడి ఉంటామని తెలిపారు.

## పెరిగిన మామిడిపండ్ల ధరలు
### దిగుబడుల తగ్గాయంటున్న వ్యాపారులు



విజయవాడ,మే14 (ప్రజామంటలు):
మామిడిపండ్ల ధరలు బేజారెత్తిస్తున్నాయి. సీజన్ ఆరంభమై ఇప్పుడిప్పుడే మార్కెట్లోకి మామిడిపండ్ల రాక మొదలవడంతో డిమాండ్ ఏర్పడి ధరలు చుక్కలనంటుతున్నాయి. హైదరాబాద్లో బంగినపల్లి మామిడి పళు కిలో కనీసం వందకు తక్కువగా అమ్మడంలేదు. దీనికితోడు ఎక్కడా పెద్దగా పండ్ల బండ్లు అమ్మకానికి రావడం లేదు. ఈ యేడు పంట దిగుబడులు తగ్గడం బంగినపల్లి, చెరకురసాలు, పందారకల్తీ.. ఇలా ఏ రకమైనా సరే ధర అందనంతగా ఉంది. విజయవాడ, కాకినాడ తదితర ప్రాంతాల్లో కాస్త పెద్దసైజువి బంగినపల్లి పరక రూ.500పైనే చెబుతున్నారు. బేరం ఆడితే రూ. 450కు ఇస్తున్నారు. చెరకురసాలు, పందార కల్తీ పరక రూ.350 వరకూ చెబుతున్నారు. దీంతో ధనికవర్గాలకు తప్ప సామాన్యులకు మామిడిపండ్లు ఇప్పట్లో దొరికే పరిస్థితి లేదు. రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డులోని మార్కెట్యార్డు వద్ద ప్రతి ఏటా మామిడిపండ్ల మార్కెట్ జరుగుతుంది. రాజమహేంద్రవరం చుట్టుపక్కల ప్రాంతాలైన కోరుకొండ, నల్లగొండ, కోటి, గోకవరం, రంపయర్రంపాలెం, గంగంపాలెం, తిరుమలాయిపాలెం, జగ్గంపేట తదితర ప్రాంతాల నుంచి ఇక్కడకు మామిడిపండ్లు ఎక్కువగా తెస్తుంటారు. ఇక్కడ హోల్సేల్, రిటైల్గాను మామిడిపండ్లు విక్రయాలు జరుగుతుంటాయి. సైకిళ్లపై అమ్ముకునేవారు ఇక్కడి నుంచే కొనుగోలు చేస్తుంటారు. కొందరు చిరు వ్యాపారులు స్థానికంగా చిన్న చిన్న రాశులుగా పోసి మామిడిపండ్ల విక్రయాలు చేస్తుంటారు. అయితే హోల్సేల్ మార్కెట్లోనే ధరలు ఇలా మండిపోవడంతో మామిడిపండ్ల మామిడిప్రియులకు నిరాశ ఎదురవుతోంది. కొంతమంది మాత్రం ధర ఎలా ఉన్నా కనీసం పరక పండ్లయినా కొనుగోలు చేస్తున్నారు. మరో వారం, పది రోజులు పోతేనే కానీ ధరలు తగ్గే అవకాశం లేదని వ్యాపారులు చెబుతున్నారు. మామిడిపండ్ల సీజన్ ప్రారంభం కావాల్సి ఉండగా ఈ ఏడాది మే మొదటి వారంలోనే మార్కెట్లోకి మామిడిపండ్లు వచ్చాయి. తేనె మంచు విపరీతంగా కురవడంతో పూత మాడిపోయి దిగుబడులు తగ్గిపోయాయని మామిడి పండ్ల వ్యాపారులు చెబుతున్నారు. దీనివల్ల కూడా సీజన్ ఆలస్యమైనట్టు పేర్కొంటున్నారు. పూత మాడిపోయి దిగుబడి తగ్గడంతో ధరలు కూడా పెరిగాయని, మార్కెట్లోకి మామిడి పండ్లు ఎక్కువగా వస్తేనే ధరలు కాస్త తగ్గే అవకాశం ఉందని వీరు చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ధరలు కొంచెం ఎక్కువగానే ఉంటాయని మామిడి పండ్ల వ్యాపారులు అన్నారు.